# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జన శ్రేయస్సే మా బాధ్యత



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 02 సంచిక : 15, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం -14 - మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## 'ఆపరేషన్ సిందూర్'పై 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

70 దేశాల దౌత్యాధికారులకు రక్షణ నిఘా సంస్థ డీజీ వివరణ




లక్ష్యాల ఎంపిక, భారత సైనిక సామర్థ్యం, తప్పుడు ప్రచార ఖండనపై స్పష్టత

కేంద్ర మంత్రివర్గం, పార్లమెంటరీ కమిటీకి కూడా ఆపరేషన్ వివరాలు

## ఢిల్లీలో రూ. 3 కోట్లతో మేఘమథనం

### కాలుష్య భూతంపై 'వారుణాస్త్రం'!..

కాలుష్య రక్కసిని సంహరించడానికి వరుణుడినే ఓ అస్త్రంగా సంధించబోతోంది



ఢిల్లీ నగరం కాలుష్య భూతంతో పోరాటానికి సిద్ధమవుతోంది

ఒక్కో ప్రయోగం వ్యవధి గంట నుంచి గంటన్నర

### అమెరికాకు భారత్ ఝులక్..

## అగ్రరాజ్యం వస్తువులపై అధిక టారిఫ్

అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలకు భారత్ నిర్ణయం



భారత ఉక్కు, అల్యూమినియంపై సుంకాలకు ప్రతిచర్య

డబ్ల్యూటీఓకు అధికారికంగా తెలిపిన భారత్

కొన్ని అమెరికా వస్తువులకు రాయితీల రద్దు, సుంకాల పెంపు

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన విధానం

### మన డ్రోన్లు శత్రువులను మట్టికరిపించిన వేళ ఆ నినాదం మార్మోగింది

- పంజాబ్‌లోని ఆదంపుర్ ఎయిర్‌బేస్‌లో జవాన్లను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం
- ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని భారత సైన్యం ప్రతినబూనిందని వెల్లడి
- భారత్ మాతాకీ జై' నినాదం శత్రువులను వణికిస్తోందని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి భారత పరాక్రమం తెలిసిందన్న ప్రధాని



ఆదంపూర్: భారత్ మాతాకీ జై.. ఇది దేశ ప్రజల నినాదం అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. యుద్ధ రంగంలో సైనికులు భారత్ మాతాకీ జై అంటే.. శత్రువు వెన్నులో వణుకు పుట్టడం ఖాయమన్నారు ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్ తరువాత మంగళవారం ప్రధానమంత్రి 'నరేంద్ర మోదీ' పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లారు. అక్కడ వాయుసేన సేవలను ఉద్దేశించి ప్రసంగించారు. పాకిస్తాన్‌కు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తన సత్తా చూపించిందని అన్నారు. భారత్ మాతాకీ జై.. ఇది దేశ ప్రజల నినాదం అని అన్నారు. యుద్ధ రంగంలో మన సైనికులు చరిత్ర సృష్టించారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది ప్రపంచమంతా మార్మోగిందని, ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

### నా జీవితం ధన్యమైంది

'దేశ ప్రజలంతా సైన్యానికి అండగా నిలబడ్డారు. భారత్ శక్తి సామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. మన సైన్యం సామర్థ్యం భావి తరాలకు స్ఫూర్తిదాయకం. వీర సైనికులందరికీ నా సెల్యూట్. ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మారుమ్రోగింది. సైన్యం దేశ ఆత్మ విశ్వాసం మిగతా..2లో



## పాక్ ను ఎలుకతో పోల్చిన పవన్ కల్యాణ్..

- పాక్ ను ఎలుకతో, భారత్ ను శేషనాగుతో ఆయన పోల్చారు
- తమిళ కవి తిరువళ్లువార్ రచించిన తిరుక్కురల్ గ్రంథంలోని పద్యాన్ని పవన్ తన ట్వీట్ లో ప్రస్తావించారు
- 'ఎలుకలన్నీ జేరి సముద్రము వలే ఘోషించినప్పటికీ ఏమి హాని జరుగుతుంది..?
- శేషనాగు ఒక్క హుంకారం చేయగానే అవన్నీ నశిస్తాయి"

### గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ రిజర్వేషన్లపై

## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

జీవో నెం.3 ను పునరుద్ధరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష

ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకే కట్టుబడి ఉన్నామని వెల్లడి



అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెం.3ను పునరుద్ధరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాలు, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకులపై చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు మిగతా..2లో



## కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలపై హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

- బీఆర్ఎస్‌లో విభేదాలు లేవు
- కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు ఇస్తే స్వాగతిస్తానన్న మాజీ మంత్రి
- కేసీఆర్ ఆదేశాలకు కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ
- కాంగ్రెస్ హామీల వైఫల్యంపై తీవ్ర విమర్శలు

## దేశంలో ఎక్కడా లేని పథకం రాజీవ్ యువ వికాసం స్కీమ్



- తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో 10 సంవత్సరాలు గడిపింది
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చాం

హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు నియోజకవర్గంలో గల బయ్యారం టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధితో ఎదగడానికి రాజీవ్ యువ వికాసం వరం లాంటిది అన్నారు. భారతదేశంలో ఇలాంటి పథకం ఎక్కడా లేదన్నారు. 10 ఏళ్లు పాలించిన టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతి కల్పించలేదనీ ఆరోపించారు. ఇక, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవంతో.. తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో 10 సంవత్సరాలు గడిపిందనీ మిగతా..2లో

# రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

- పరిశ్రమలకు రెడ్ కార్పెట్... ప్రతి సంస్థకు ఒక నోడల్ అధికారి
- నారా లోకేశ్ వినూత్న నిర్ణయం
- వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు



అమరావతి: రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్న సంస్థలకు సత్వర అనుమతులు, పూర్తిస్థాయి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రూ.91,839 కోట్ల పెట్టుబడితో, 1,41,407 ఉద్యోగాలను కల్పించేందుకు సుమారు 91 దిగ్గజ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై మిగతా..2లో



## వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం: వైఎస్ జగన్

- వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- మురళీ నాయక్ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉంటుందన్న జగన్
- మురళీ నాయక్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్న వైసీపీ

### ఈ నెల 18న మరో కీలక ప్రయోగానికి

# సిద్ధమవుతున్న ఇస్రో

- పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగానికి రెడీ అవుతున్న ఇస్రో
- రీశాట్-1బీ శాటిలైట్ ను కక్ష్యలో ప్రవేశపెట్టనున్న ఇస్రో
- సైనిక దళాలకు వ్యూహాత్మకంగా ఉపయోగపడనున్న రీశాట్-1బీ



ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) వేదికగా ఈ నెల 18వ తేదీ ఉదయం 6.59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ61 వాహకనౌకను ప్రయోగించనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి జరగనున్న ఈ ప్రయోగం ద్వారా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న భూ పరిశీలన ఉపగ్రహం 'రీశాట్-1బీ'ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. మిగతా..2లో

## ఏపీ సైనిక్ స్కూళ్లలో తెలంగాణ వారికి అవకాశం కల్పించాలి

- తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే వరకు ఏపీలో స్థానికత కల్పించాలని డిమాండ్
- దేశంలోని అనేక రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయన్న మంత్రి
- తెలంగాణలోనూ తక్షణమే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి


2లో

### అమెరికాకు భారత్ ఝలక్..
## అగ్రరాజ్యం వస్తువులపై అధిక టారిఫ్

ఢిల్లీ: అమెరికా నుంచి దిగుమతి అయ్యే కొన్ని ప్రత్యేక వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) దృష్టికి తీసుకెళ్లింది. భారత ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా విధించిన అధిక సుంకాలకు ప్రతిస్పందిస్తూ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని ఎంపిక చేసిన అమెరికా ఉత్పత్తులపై ఇప్పటివరకు కల్పిస్తున్న రాయితీలను ఉపసంహరించుకోవడంతో పాటు, వాటిపై దిగుమతి సుంకాలను గణనీయంగా పెంచనున్నట్లు భారత్ డబ్ల్యూటీఓకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. అమెరికా తీసుకున్న ఏకపక్ష వాణిజ్య నిర్ణయాల వల్ల సుమారు 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అగ్రరాజ్యం అనుసరిస్తున్న ఈ రక్షణాత్మక ధోరణులను భారత్ గతంలోనే తప్పుబట్టిన విషయం తెలిసిందే. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షపదవి చేపట్టాక పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే ముడి ఉక్కు ఉత్పత్తిలో రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్‌పై కూడా ఈ సుంకాల ప్రభావం గణనీయంగా పడింది. ఈ నేపథ్యంలో, భారత్ తమ వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకునేందుకు డబ్ల్యూటీఓ వేదికగా ఈ అంశాన్ని బలంగా లేవనెత్తింది. భారత్, అమెరికా మధ్య నూతన వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు చర్చలు తుది దశకు చేరుకున్నాయని వార్తలు వస్తున్న తరుణంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించేందుకు భారత్ ఈ ఒప్పందంలో భాగంగా పలు కీలక రాయితీలు కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేసిందని గతంలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రస్తుత ప్రతీకార చర్యల నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## ఫ్రీగా విమానం వస్తుంటే
## వదులుకోవడానికి తెలివితక్కువ వాడినా?

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు ఖతార్ పాలకులు విలాసవంతమైన విమానాన్ని బహుమతిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ గిఫ్ట్ అందుకోనుండటంపై ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి బహుమతిని అంగీకరించకపోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. వైట్‌హౌస్ వద్ద ఈ బహుమతికి సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ బదులిచ్చారు. ఈ విమానం అందుకోవడం అన్నది గొప్ప విషయమంటూ ట్రంప్ అభివర్ణించారు. అయితే, ఈ గిఫ్ట్ ద్వారా ఖతార్ రాయల్ ఫ్యామిలీ ఏమైనా లబ్ధి పొందుతుందా? భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయా? అనే విషయాలను ఆయన కొట్టిపారేశారు. 'నేను ఇలాంటి ఆఫర్‌ను ఎప్పటికీ తిరస్కరించను. ఉచితంగా ఖరీదైన విమానాన్ని ఇస్తున్నప్పుడు వద్దనడానికి నేను ఏమైనా తెలివితక్కువ వాడినా?' అని పేర్కొన్నారు. ఇక, అధ్యక్ష కాలం ముగిసిన తర్వాత ఈ విమానాన్ని వ్యక్తిగతంగా ఉపయోగించుకుంటారా? అని ఒక విలేకరి ప్రశ్నించారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'వారు ఫ్రీ జెట్ విమానం ఇస్తుంటే వద్దు లేదు. నాకు ఫ్రీగా వద్దు. దీనికి మీకు 1 బిలియన్ డాలర్లు లేదా 400 మిలియన్ డాలర్లు చెల్లిస్తానని చెప్పాలా' అని ట్రంప్ ఘాటుగా బదులిచ్చారు. అనంతరం ఈ విమానాన్ని భవిష్యత్తులో అధ్యక్ష లైబ్రరీకి ప్రదర్శనకు విరాళంగా ఇస్తామన్నారు.

భారత్-పాక్ అణుయుద్ధాన్ని మేమే ఆపాం: ట్రంప్

ఈ వారంలో ట్రంప్ మధ్యప్రాచ్యంలో పర్యటించనున్నారు. ఈక్రమంలో ఖతార్ పాలక కుటుంబం నుంచి విలాసవంతమైన 747-8 జంబో జెట్ విమానం బహుమతిగా వచ్చింది. దీన్ని ట్రంప్ స్వీకరించారు. అమెరికా అధికారులు దీనికి అధ్యక్ష విమానానికి (ఎయిర్‌ఫోర్స్ వన్) తగ్గట్టుగా కొన్ని హంగులు సమకూర్చనున్నారు. 2029 జనవరిలో పదవీవిరమణ చేసేవరకు ఈ విమానాన్ని ట్రంప్ 'ఎయిర్‌ఫోర్స్ వన్'కు కొత్త వెర్షన్‌గా ఉపయోగించాలని ప్రణాళికలు చేస్తున్నారు. అయితే, ఈ ప్రణాళికపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ ఈ ఖరీదైన బహుమతిని స్వీకరించడంతో పాటు దాన్ని ఎయిర్‌ఫోర్స్ వన్‌గా వినియోగించాలనుకోవడం జాతీయ భద్రతాపరమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని పలువురు డెమోక్రట్లు పేర్కొన్నారు.

## లుంగీలో పారిపోయిన మాజీ అధ్యక్షుడు..!

బంగ్లాదేశ్: బంగ్లాదేశ్ లో మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత ఆ పార్టీ నేతలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే హసీనా దేశం విడిచి భారత్‌లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. మిగతా నాయకులు తాత్కాలిక ప్రభుత్వంలో అనేక కేసుల్లో చిక్కుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ తాజాగా దేశం విడిచి పారిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఆయన థాయ్‌లాండ్ విమానం ఎక్కినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. అవామీ లీగ్ విద్యార్థి విభాగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన హమీద్ తొలుత ఎంపీగా ఎన్నికయ్యారు. 2013 నుంచి 2023 మధ్య హసీనా ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రెండు సార్లు అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అయితే, గతేడాది ఆగస్టులో విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారి హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం అవామీ లీగ్ హయాంలో ఆందోళనకారులపై దాడులు, హత్యల ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో మాజీ అధ్యక్షుడు హమీద్‌పై హత్య కేసు నమోదైంది. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న 81 ఏళ్ల హమీద్ గతవారం ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి థాయ్ ఎయిర్‌వేస్ విమానం ఎక్కినట్లు కథనాలు వచ్చాయి. ఆయన వెంట సోదరుడు, బావ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌పోర్టులో ఆయన దృశ్యాలు బయటకు వచ్చాయి. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లుంగీలో ఉన్న హమీద్ విమానాశ్రయానికి వచ్చినట్లుగా అందులో ఉంది. దీంతో యూనస్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే కొంతమంది పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని బదిలీ చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఆయన వైద్య చికిత్స నిమిత్తం థాయ్ వెళ్లినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే, విచారణ నుంచి తప్పించుకునేందుకే దేశం విడిచి పారిపోయినట్లు రాజకీయ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అవామీ లీగ్ పార్టీని నిషేధిస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. అవామీ పార్టీ, దాని నాయకులపై ప్రత్యేక ట్రైబ్యునల్ విచారణ పూర్తయ్యేవరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది.

## ఢిల్లీలో రూ. 3 కోట్లతో మేఘమథనం
### కాలుష్య భూతంపై 'వారుణాస్త్రం'!..

ఢిల్లీ: చినుకు కోసం మేఘాలను చిలకబోతోంది దేశ రాజధాని ఢిల్లీ నగరం. కాలుష్య రక్కసిని సంహరించడానికి వరుణుడినే ఓ అస్త్రంగా సంధించబోతోంది. సాంకేతిక పరిజ్ఞానం దన్నుతో ఢిల్లీ నగరం కాలుష్య భూతంతో పోరాటానికి సిద్ధమవుతోంది. ఢిల్లీలో ఈ నెలాఖరు నుంచి ఐదు ప్రదేశాల్లో మేఘమథనం ట్రయల్స్ నిర్వహించనున్నారు. మేఘాలు, తేమ ఆధారంగా ఆ ఐదు ప్రాంతాలను అప్పటికప్పుడు నిర్ణయిస్తారు. సరైన తేమ ఉంటేనే మేఘాలు వర్షిస్తాయి. అందుకే అనువైన మేఘాలు, సరిపోను తేమ వంటి అంశాలను గమనించి ఆ ఐదు ప్రదేశాలను ఎంపిక చేయనున్నారు. భద్రతా కారణాల రీత్యా లుట్యెన్స్ ఢిల్లీ, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంతాలను మేఘమథనం నుంచి మినహాయించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కాన్పూర్ ఐఐటీ సాంకేతిక సహకారంతో ఢిల్లీ శివార్లలో అమలయ్యే ఈ ప్రాజెక్టు వ్యయం రూ.3.21 కోట్లు. 100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో కృత్రిమ వర్షం తొలి ట్రయల్ నిర్వహిస్తారు. ఒక్కో ప్రయోగం వ్యవధి గంట నుంచి గంటన్నర. వేర్వేరు రోజుల్లో జరపనున్న ఈ మేఘమథనం కోసం 13 కేంద్ర, రాష్ట్ర (ఢిల్లీ) ప్రభుత్వ సంస్థల నుంచి లాంఛనపరమైన అనుమతులు లభించాల్సివుంది. ఢిల్లీలో కృత్రిమ వాన కురిపించాలనే ప్రతిపాదనలు తెరపైకి రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2023 శీతాకాలంలో ఈ ప్రతిపాదనను ప్రకటించింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవంటూ ఆ కార్యక్రమాన్ని అప్పట్లో అది విరమించుకుంది. నిరుడు శీతాకాలంలోనూ మేఘమథనం కోసం 'ఆప్' సర్కారు పాకులాడింది. కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదంటూ ఆ ప్రయత్నం నుంచి మరోమారు వెనక్కు తగ్గింది. ఈ ప్రయోగంలో వర్షించడానికి అనుకూలమైన, సరిపోను తేమ గల మేఘాల కోసం శాస్త్రవేత్తలు అన్వేషిస్తారు. వాటిని గుర్తించాక సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ (ఉప్పు), డ్రై ఐస్ (ఘనీకృత కార్బన్ డై ఆక్సైడ్) వంటి రసాయన పదార్థాలను విమానంలో తీసుకెళ్లి ఆ మేఘాలపై చల్లుతారు. అలా మేఘాలు వర్షిస్తాయి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి, గాలి నాణ్యతను మెరుగుపరచడానికి పలు దేశాల్లో ఇలాంటి 'స్వల్పకాలిక' ప్రయోగాలు చేస్తున్నారు. అయితే వీటితో ఉపయోగమెంత అనేది ఓ చర్చనీయాశంగానే మిగిలింది!

## పాక్ ను ఎలుకతో పోల్చిన పవన్ కల్యాణ్..

అమరావతి: భారత్, పాక్ ల మధ్య మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్న వేళ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. పాక్ ను ఎలుకతో, భారత్ ను శేషనాగుతో ఆయన పోల్చారు. పాకిస్థాన్ వక్రబుద్ధిని తిరువళ్లువార్ తిరుక్కురల్ లోని ఓ పద్యంతో విమర్శించారు. తమిళ కవి తిరువళ్లువార్ రచించిన తిరుక్కురల్ గ్రంథంలోని పద్యాన్ని పవన్ తన ట్వీట్ లో ప్రస్తావించారు. "ఎలుకలన్నీ జేరి సముద్రము వలే ఘోషించినప్పటికీ ఏమి హాని జరుగుతుంది..? శేషనాగు ఒక్క హుంకారం చేయగానే అవన్నీ నశిస్తాయి" అని చెప్పారు. తన ట్వీట్ లో ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు సంబంధించిన ఫొటోను జతచేశారు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ఏపీ సైనిక్ స్కూళ్లలో
## తెలంగాణ వారికి అవకాశం కల్పించాలి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నూతన సైనిక్ స్కూల్ నెలకొల్పే వరకు, ఆంధ్రప్రదేశ్‌లోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు స్థానిక హెూదా కల్పించాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు హాజరైన సుమారు 20 వేల మంది తెలంగాణ విద్యార్థులు నిరాశకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని గుర్తు చేస్తూ, తెలంగాణలో కూడా వీలైనంత త్వరగా ఒక సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ లేకపోవడం వల్ల ఇక్కడి విద్యార్థులు అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ పరిస్థితి విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తక్షణమే జోక్యం చేసుకుని, తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి జోక్యంతో సమస్య పరిష్కారమై, విద్యార్థుల ఆందోళన తొలగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన విధానం

మొదటి పేజి తరువాయి



సైన్యం దేశ ఆత్మ విశ్వాసం పెంచింది. ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సిద్ధాంతం. అక్క చెల్లెల సిందూరం తుడిచినవారిని నాశనం చేశాం' అని మోదీ సైన్యాన్ని కొనియాడారు.

వచ్చేది వినాశనమే పాక్ కు నిద్ర పట్టనివ్వను

'గురిచూసి కొట్టిన దెబ్బతో.. శత్రు స్థావరాలు మట్టిలో కలిశాయి. వారు వెనుక నుంచి దాడి చేస్తే.. మీరు ముందు నిలబడి ధైర్యంగా దాడిచేశారు. పాకిస్తాన్ డ్రోన్స్, యూవీఏలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు మన రక్షణ వ్యవస్థ ముందు నిలబడలేకపోయాయి. పాక్ శత్రువులు పౌరులను అడ్డుపెట్టుకుని దాడులకు పాల్పడింది. కానీ మీరు మాత్రం పౌరులకు ఎలాంటి నష్టం కలగకుండా శత్రువును దెబ్బకొట్టారు. అణు బ్లాక్ మెయిల్‌ను భారత్ ఎప్పటికీ సహించదు. మళ్ళీ ఉగ్రదాడి జరిగితే.. భారత్ కచ్చితంగా సమాధానం ఇస్తుంది. ప్రతి కుటుంబం మీకు రుణపడి ఉంటుంది' అని మోదీ పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు భారత సైన్యం కృతనిశ్చయంతో ఉందని, ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మన డ్రోన్లు, క్షిపణులు శత్రువులను మట్టికరిపించిన వేళ 'భారత్ మాతాకీ జై' నినాదం వారి చెవుల్లో మార్మోగిందని అన్నారు. భారత సైన్యం కనబరిచిన అసామాన్య ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ, ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాలని మన సేనలు ప్రతిన బూనాయని తెలిపారు. "మన సైన్యం కనబరిచిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణ్వస్త్రాల ద్వారా బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలను మన సైన్యం అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది" అని ఆయన పేర్కొన్నారు. యుద్ధక్షేత్రంలో కూడా 'భారత్ మాతాకీ జై' నినాదాలు మార్మోగాయని, ఆకాశం నుంచి పాతాళం వరకు ఈ నినాదం ప్రతిధ్వనించిందని అన్నారు. ఈ పవిత్ర భూమి నుంచి వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నానని ప్రధాని అన్నారు."మీ పరాక్రమంతో 'ఆపరేషన్ సిందూర్' నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. ప్రతి భారతీయుడు సైన్యానికి అండగా నిలబడ్డాడు. భారత సేనలకు యావత్ దేశం కృతజ్ఞతలు తెలియజేస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం ధరించడం మన సంప్రదాయమని, అదే మన విధానమని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత విషయంలో, ముఖ్యంగా మహిళల గౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. "మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచిన దుర్మార్గులను, వారి నట్టింట్లోకి చొరబడి మరీ నాశనం చేశాం" అని ఆయన ఉద్వేగపూరితంగా ప్రసంగించారు.

### కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలపై
## హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలున్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెరదించారు. పార్టీలో ఎలాంటి వర్గపోరు లేదని స్పష్టం చేస్తూనే, కేటీఆర్ కు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో తనకు, కేటీఆర్‌కు మధ్య విభేదాలున్నాయన్న ప్రచారాన్ని హరీశ్ రావు కొట్టిపారేశారు. ఒకవేళ కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే తాను తప్పకుండా స్వాగతిస్తానని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని, ఆయన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తానని తెలిపారు. "కేసీఆర్‌కు నేను రాముడికి హనుమంతుడిలా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ మాటే నా బాట. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ గీత దాటే ప్రసక్తి లేదు" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, అందరం కేసీఆర్ నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై చాలాసార్లు స్పష్టతనిచ్చానని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోయామని ప్రజలు గ్రహించారని, తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను ప్రస్తుత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని, కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## ఏపీ భవన్‌లో ఆక్రమణల
## తొలగింపు ప్రక్రియ నిలిపివేత

అమరావతి: దేశ రాజధాని ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రాంగణంలో ఆక్రమణల తొలగింపు అంశంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. 0.37 ఎకరాల్లో ఆక్రమణలను గుర్తించిన అధికారులు... అందులో రెండు ప్రార్థనా మందిరాలు ఉన్నాయని తెలిపారు. వాటిని తొలగించాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ప్రార్థనా మందిరాల తొలగింపుపై సంయమనం పాటించాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. ఇది ప్రజల మనోభావాలు దెబ్బతినే అంశం కనుక ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులతో చెప్పారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు నిలిపివేశారు.

### ఈ నెల 18న మరో కీలక ప్రయోగానికి
## సిద్ధమవుతున్న ఇస్రో

మొదటి పేజి తరువాయి




నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శాస్త్రవేత్తలు చురుగ్గా పూర్తి చేస్తున్నారు. ఈ రీశాట్-1బీ ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్) దీని ప్రధాన ప్రత్యేకత. ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడా లేకుండా, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా భూ ఉపరితలాన్ని అత్యంత స్పష్టతతో కూడిన (హై-రిజల్యూషన్) చిత్రాలను తీయగలదు. ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, ఈ ఉపగ్రహం అందించే సమాచారం భారత సైనిక దళాలకు అత్యంత వ్యూహాత్మకంగా ఉపయోగపడనుంది. దేశ భద్రత, ముఖ్యంగా సైనిక అవసరాలకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించడంలో రీశాట్-1బీ కీలక పాత్ర పోషించనుంది. ఉగ్రవాదుల స్థావరాలు, వారి కదలికలను పసిగట్టడంతో పాటు, సరిహద్దు ప్రాంతాలలో శత్రు సైన్యాల కార్యకలాపాలను కూడా ఇది నిశితంగా పరిశీలించి, అధిక రిజల్యూషన్ ఛాయాచిత్రాలను అందించగలదు.

### గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ రిజర్వేషన్లపై
## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే 2020లో రద్దయిన జీవో నెం.3 పునరుద్ధరణకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. జీవో పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనులు, గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా జీవో నెం.3 పునరుద్ధరణపై ప్రస్తుతం ఉన్న మూడు అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకే కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లు జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని లేదా అదే స్థాయిలో గిరిజనులకు న్యాయం జరిగేలా ఉండాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదింపులు జరపాలని ఆదేశించారు.

### దేశంలో ఎక్కడా లేని పథకం రాజీవ్ యువ వికాసం స్కీమ్

మొదటి పేజి తరువాయి

నిద్రోల్లో 10 సంవత్సరాలు గడిపిందనీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చాం.. మిగిలిన ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాం.. రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్ ను ప్రారంభించామని పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ వరకు యువజన వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామని వెల్లడించారు. అవగాహన లేని కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, సివిల్ స్కోరుకు రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎలాంటి సంబంధం లేదని భట్టి విక్రమార్క అన్నారు.

## వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి
## రూ.25 లక్షల ఆర్థిక సాయం: వైఎస్ జగన్

శ్రీసత్యసాయి జిల్లా: వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ తరఫున రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం ఆయన గోరంట్ల మండలం కల్లితండాలో వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వీర జవాను మురళీ నాయక్ జీవితం స్ఫూర్తి దాయకం అని.. ఆయన త్యాగానికి ప్రజలంతా రుణపడి ఉండాలన్నారు. జవాను చనిపోతే రూ. 50 లక్షల రూపాయలు ఇచ్చే సంప్రదాయం తమ ప్రభుత్వం ప్రారంభించిందని.. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇదే విధానం కొనసాగిస్తోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ. 25 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని వైఎస్ జగన్ తెలిపారు. దేశం కోసం పోరాడుతూ, మురళీనాయక్ వీరమరణం పొందారని.. మురళీ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉందన్నారు. మురళీ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా. మురళీ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది" అని వైఎస్ జగన్ అన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై
## 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

ఢిల్లీ: పీఓకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన కీలక వివరాలను అంతర్జాతీయ సమాజానికి భారత్ తెలియజేసింది. ఈ ఆపరేషన్ గురించి రక్షణ నిఘా సంస్థ (డీఐఏ) డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా సుమారు 70 దేశాలకు చెందిన దౌత్యాధికారులకు సమగ్రంగా వివరించారు. ఢిల్లీలోని రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, 'ఆపరేషన్ సిందూర్' కోసం లక్ష్యాలను ఏ విధంగా ఎంపిక చేశారో, ఈ ఆపరేషన్‌లో ప్రదర్శితమైన భారత సైనిక శక్తిసామర్థ్యాలను లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా దౌత్యవేత్తలకు వివరించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కొన్ని శక్తులు చేసిన తప్పుడు ప్రచారాన్ని, దాని వల్ల ప్రాంతీయ స్థిరత్వంపై పడే ప్రభావాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు. అటువంటి తప్పుడు సమాచారాన్ని భారత్ ఏ విధంగా సమర్థవంతంగా ఎదుర్కొందో కూడా ఆయన వివరించారు. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భవిష్యత్ భద్రతా వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించేందుకు బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. మరోవైపు, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను విదేశాంగ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘ సభ్యులతో కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.

## రాష్ట్రానికి వచ్చేందుకు
## 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

మొదటి పేజి తరువాయి




ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై ఇవాళ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని స్పష్టం చేశారు. దీనివల్ల అనుమతుల ప్రక్రియ వేగవంతమై, సంస్థలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలవుతుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం నగరాన్ని అత్యాధునిక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా, 'మన మిత్ర' యాప్‌లో అందుబాటులో ఉన్న 317 సేవలను నెలాఖరు నాటికి 400కు పెంచాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ధృవపత్రాలకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్ సాంకేతికత జోడించాలని, పన్నుల బకాయిల వివరాలను వాట్సాప్ ద్వారా తెలిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్‌లో డేటా పాయింట్లు, కేపీఐలను ఇంటిగ్రేట్ చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో పొందుపరచాలన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే వ్యవస్థను పటిష్టం చేయాలని, విశాఖలో జూన్ 9, 10 తేదీల్లో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఏకీకృతం చేసి, కృత్రిమ మేధ (ఏఐ) జోడించి ఒకే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సరళతరం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని జీవోలు, యాప్‌లను ఒకే వేదికపైకి తెచ్చి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## మన ఖజానా పెరగాలి
### అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

రాష్ట్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేడు సచివాలయంలో ఆదాయార్జన శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, గత మూడు దశాబ్దాల ఆదాయ సరళిని లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,34,208 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎం తెలిపారు. పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని శాఖల సమాచారంతో 'డేటా లేక్' ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఎగవేతలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బంగారం కొనుగోళ్లలో రాష్ట్రం ముందున్నప్పటికీ, పన్నుల రూపంలో ఆశించిన ఆదాయం రాకపోవడంపై దృష్టి సారించాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలకు, దాని విలువ నిర్ధారణకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి ఒక వరం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. కమిటీ ద్వారా ఎర్రచందనం నిల్వలు, వాటి విలువపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత ఉండేలా రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ ఆదాయం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉండటంపై దృష్టి సారించి, ఆదాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మే 11 నాటికి కేంద్రం నుంచి రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇది గత ఏడాదితో పోలిస్తే 26 శాతం తక్కువని అధికారులు సీఎంకు వివరించారు. ఆదాయార్జన శాఖలన్నీ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి, రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# గుంటూరు జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ 16రోజుకి చేరిన నిరవధిక సమ్మె



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : :జిల్లా సెక్రటరీ పల్లపాటి లింగరాజుగత 15 రోజులుగా సమస్యల పరిష్కారం కొరకు సమ్మె బాట పట్టిన ల తరుపున ప్రభుత్వంతో చర్చించేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రెసిడెంట్ శివారెడ్డి అలాగే సెక్రెటరీ విద్య సాగర్ సెక్రటేరియట్ లోని మెడికల్ డిపార్ట్మెంట్ సెక్రెటరీ ని కలిసి సి ఎచ్ ఓ ల సమస్యలను త్వరితగతిన పరిష్కారం



చూపెట్టాలని కోరడమైనది. ఈ సందర్భంగా రెండు రోజులలో ఏపీ ఎమ్ సి ఏ నాయకులతో మీటింగ్ పెట్టుకొని మాట్లాడుతామని గౌరవ సెక్రెటరీ హామీ ఇవ్వడం జరిగింది అని ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు ఏపీ ఎన్ జి ఓ రాష్ట్ర వర్గం కి ప్రేతేక ధన్యవాదములు తెలిపారుఈ క్రమంలో సి ఎచ్ ఓ లు అడుగుతున్న వేతన సవరణ అంశం కానీ, పెండింగ్ బకాయిలు కానివండి ఇది కూడా గొంతెమ్మ కోరికలు కాదు అని, 6 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం పెరగకపోగ రెండు సంవత్సరాలుగా ఉన్న బకాయిలు కోసం ఇలా సమ్మె రూపంలో ప్రభుత్వానికి బాధను వ్యక్తపరుస్తూ ఇప్పటికైనా వారి ఘోష, ఆవేదన, పట్టించుకొని పరిష్కరించాలని సి ఎచ్ లొ తరుపున గుంటూరు జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్ మరియు జిల్లా జనరల్ సెక్రటరీ హనుమంతరావు తెలిపారు ఈ కార్యక్రమం లో ఏ ఐ టీ యు సి రాష్ట టౌన్ ప్రెసిడెంట్, . అంజి బాబు.ఏఐటీయూసీ ఆశా యూనియన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులురమణ,లక్ష్మి,నెల్లూరు జిల్లా ఏపీ ఎమ్ సి ఏ కో ఆర్డినేటర్. షేక్ ఆదిల్ , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కి సంపూర్ణ మద్దతు ఉంటుంది అని తెలియచేశారు,ఏపీ ఎమ్ సి ఏ ట్రెసర్ సంధ్య. జిల్లా నాయకులు జ్యోష్న, జహీర్, అబ్దుస్, భాస్కర్. కీర్తి. అనిత,మరియు జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు

# తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహిళా భివృద్ది -శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో

**దుర్గాబాయి దేశ్ ముక్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ సంస్థ హైదరాబాద్ నందు 3 సంవత్సరాల టెక్నికల్ డిప్లమా కోర్సులకు 2025-26 సంవత్సరానికి తల్లిదండ్రులు కోల్పోయిన అనాధ బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికల నుండి అక్రమ రవాణాకు గురైన మరియు దివ్యాంగుల బాలికల నుండి దరఖాస్తులు చేసుకోవాలి..!!**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా పరిధిలోని దుర్గాబాయి దేశ్ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సమస్త మూడు సంవత్సరాలు టెక్నికల్ డిప్లమో కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ మంగళవారం ఆమె తెలిపారు..

**కోర్సుల వివరాలు:**

1. సివిల్ ఇంజనీరింగ్, 2. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, 3.కంప్యూటర్ ఇంజనీరింగ్, 4. ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితర కోర్సులు. ప్రతి కోర్సులో 60 సీట్లు గాను, మొత్తం 240 సీట్లలో తల్లిదండ్రులు కోల్పోయిన అనాధ బాలికలు మరియు తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికలకు కేటాయించబడును. అంతేకాకుండా ఇట్టి బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని మరియు మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించడం జరిగింది. ఇందులో ఎంపికైన బాలికలకు ఉచిత విద్య తో పాటు వసతి కూడా కల్పించబడును. దరఖాస్తు కొరకు ఈ క్రింది ధృవపత్రాలు జత పరచవలెను. 1) కులము (అనాధ బాలికలకు అవసరం లేదు)2) ఆదాయ ధ్రువీకరణ (అనాధ బాలికలకు అవసరం లేదు) 3) మరణ ధ్రువీకరణ పత్రం 4) బోనాఫైడ్ సర్టిఫికెట్.దరఖాస్తు ఫారంనకు సంబంధిత ధ్రువపత్రములు జత చేసి మే20, 2025 తేదీలోపు సమర్పించవలెను. ఇతర వివరములకు , బాల రక్ష భవన్ ( జిల్లా బాలల పరిరక్షణ విభాగం) సంగం లక్ష్మీబాయి స్కూల్ ఎదురుగా, ఎన్నేపల్లి చౌరస్తా, వికారాబాద్ జిల్లా , ఫోన్ నం : 9640863896, %ఆ% 9849672296 సంప్రదించగలరు.

# మోమిన్ పెట్ మండల పరిధిలో 10 కోట్ల తో కార్యక్రమాలు శంకుస్థాపన చేసిన గడ్డం ప్రసాద్ కుమార్..!!

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం పెద్ద మొత్తంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: మోమిన్ పెట్ ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోమిన్ పేట మండలంలో 10 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా రాళ్ళ గుడుపల్లి నుండి గుట్టమిది తాండా వరకు 2.40 కోట్లతో విలువ గల గిరిజన అభివృద్ధి ప్రత్యేక నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, ఉపాధి హామీ పథకం కింద రాళ్ళ గుడుపల్లి లో 15 లక్షల వ్యయంతో, లచ్చ నాయక్ తాండా లో 20 లక్షల సీసీ రోడ్డు, మోమిన్ పేట్ లో 1.05 కోట్లతో సీసీ రోడ్డులను స్పీకర్ ప్రారంభించారు. అదేవిధంగా మోమిన్ పేట్ లో ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి భూమి పూజ, బిక్కరెడ్డి గూడెంకు 3 కోట్ల వ్యయంతో చేపట్టే బీటీ రోడ్డు, మల్లారెడ్డి గూడెం మొండి కట్ట వాడుక చెరువుకు 16.85 లక్షల వ్యయంతో చేపట్టే మరమ్మత్తుల పనులకు శంకుస్థాపన చేశారు.వేల్చాల్ లో 55 లక్షలు, దుర్గం చెరువులో 50 లక్షలు, మొరంగపల్లి లో 45 లక్షలుఇబ్రా చిట్టెంపల్లి లో 30 లక్షలు, కేసారం లో 30 లక్షలు, ఎన్కేపల్లి లో 45 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లకు స్పీకర్ ప్రారంభోత్సవాలు గావించారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ




పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ నమూనా భవనాన్ని అతి తొందరలో పూర్తి చేయాలని సంబంధిత డీఈని స్పీకర్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు వెళుతుందని స్పీకర్ ఈ సందర్భంగా తెలిపారు. వెల్చాల్ గ్రామంలో రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా పై మహిళలతో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని, దీని ద్వారా యువత ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని స్పీకర్ సూచించారు. స్పీకర్ పర్యటనలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ఇఇ ఉమేష్, తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయ లక్ష్మి, హౌసింగ్ డీఈ,ఇఇ సయ్యద్ సాజిద్, శిరాజుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సజావుగా జరుగుతున్న ధాన్యం కొనుగోలు. నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు

**కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి**

**ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే ధాన్యం తరలింపు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల, జనం రిపోర్టర్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం రోజున మెట్ పల్లి మండలం ఆరపేట గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామం, మల్లాపూర్ మండలం సాతారం గ్రామం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వడగల్ల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున తార్పలిన్ కవర్లు, అందుబాటులో ఉండాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ను వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామని, ప్రతిరోజు మిల్లులకు పంపాలి, రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట మెట్పల్లిరెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, డీ ఎస్ ఓ డి ఎం, మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాలేశ్వరం సరస్వతీ పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 13. కాలేశ్వరం సరస్వతీ పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాలేశ్వరం సరస్వతీ పుష్కరాలు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, పెండింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.సీఎం రేవంత్ రెడ్డి సరస్వతీ పుష్కరాలకు వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పనులు పనులు స్పీడ్ గా జరుగుతున్నాయి అని తెలిపారు.యూపీలో జరిగిన కుంభమేళా తరహాలో ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరగాలనియూపీలో జరిగే మహాకుంభమేళా కు రావాలని కొందరు సీఎం రేవంత్ రెడ్డిని కోరితే తెలంగాణలోనే అత్యంత వైభవంగా పుష్కరాలు జరుగుతాయని, దానికి ప్రధానమంత్రికి ఆహ్వానం పంపుతామని తెలిపారని ఎంపీ వంశీ గుర్తుకు చేశారు.కుంభమేళా కంటే పది రేట్లు ఎక్కువగా సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తాం అని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా కు ఆహ్వానం అందిస్తాం అని, మోదీ వచ్చి తప్పకుండా కాలేశ్వరం వచ్చి సరస్వతి పుష్కరాల్లో, త్రివేణి సంఘంలో పుణ్యస్నానాలు ఆచరించాలని కోరుతున్నాం అని అన్నారు.

# వడదెబ్బతో గ్రామపంచాయతీ సిబ్బంది మరణం



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హనుమకొండ జిల్లా,హసన్ పర్తి మండలంలోని సీతానాగారం గ్రామంచాయతీలో పంపు ఆపరేటర్ గా విధులు నిర్వర్తిస్తున్న క్రీ:శే:దావ రాజేందర్ పార్థివ దేహానికి ఘనంగా నివాళు లర్పించి,వారికుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.రాజేందర్ కు భార్య



స్వప్న,ఒక కుమారుడు సాగర్ ఉన్నారు,ప్రభుత్వం నుండి యాభైలక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించి,ప్రస్తుత దహన సంస్కారాల కర్చుల నిమిత్తం పది వేల రూపాయలు ఇచ్చి,కుటుంబసభ్యుల లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, రోడ్డున పడ్డ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నుండి డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కారోబార్,బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతల్ల సదానందం,పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకులు గుండ్లపెల్లి వెంకన్న గౌడ్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బండి రజిని కుమార్,కారోబార్, బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తగరం శివ,హసన్ పర్తి మండల అధ్యక్షులు బండి రమేష్,కార్యదర్శి కుక్కముడి నరేష్,జోరుక రాజేందర్,దావా దేవేందర్,కూనమల్ల రమేష్, ఇల్లందుల సదానందం,పాల్గొన్నారు

# హత్యా కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా పరిధిలోని కోట్పల్లి మండల వివిధ గ్రామాలలో బాచుపల్లి గ్రామంలో గత2014 డిసెంబరు 5న కోట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యా కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డా. సున్నం శ్రీనివాస్ రెడ్డి ఈ రోజు తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి తెలిపారు.ఇట్టి కేసు వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి పెంటప్పా (ఫిర్యాదుదారుడు) మరియు తన తమ్ముడు బాసుపల్లి హన్మంతు (మృతుడు)కు తమ పాలివారైన బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరచూ ఘర్షణలు జరిగేవి. 2014 డిసెంబరు 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో హన్మంతు తన ఇంటికి వెళ్లే క్రమంలో బాసుపల్లి అంజిలప్ప పాత గొడవలు మనసులో పెట్టుకొని గొడవకు దిగాడు. ఆ సమయంలో అంజిలప్ప కుమారులు ఏ1 శ్రీనివాస్, ఏ2 పాండు అక్కడికి వచ్చి హన్మంతును దాడి చేయగా ు పాండు పట్టుకొని, శ్రీనివాస్ కట్టెతో తలపై, అంజిలప్ప రాయితో తలపై దెబ్బతీసిన ఫలితంగా హన్మంతు అక్కడికక్కడే మృతి చెందాడు అని ఫిర్యాదు రాగ ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఆర్. రమేష్ క్రైం నం.150/2014గా ఐపిసి సెక్షన్ల 148, 302, 326, 324, 201, 109 ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి కరణ్‌కోట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శివ శంకర్ దర్యాప్తు నిర్వహించి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి ఈ రోజు నిందితులకు జీవిత ఖైదు మరియు జరిమానా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసులో న్యాయసేవ అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణ గౌడ్, వి. రవి కుమార్, పి. సుధాకర్ రెడ్డి లు, దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్సై ఆర్. రమేష్, ఇన్స్పెక్టర్ కె. శివ శంకర్, ప్రస్తుత ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. రఘు రాములు, ఎస్సై ఎం.ఏ. గఫ్ఫార్, సి డి ఓలు మహేశ్వర్ రెడ్డి, బ్రీఫింగ్ అధికారి బి. వీరన్నలు సమిష్టిగా కృషి చేశారు.ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి అభినందించారు.

# అంగన్వాడి కేంద్రంలో కిశోర వికాసం



నార్పల ( జనం రిపోర్టర్ ) : మండల కేంద్ర పరిధిలో గల ఉయ్యాలకుంట వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ భారతి అధ్యక్షతన కిషోర వికాసం నాలుగో విడతను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కిషోర బాలికలకు సిడిపిఓ బాలల యొక్క చట్టాలు - పిఓసిఎస్ఓ చట్టాల గురించి క్లుప్తంగా వివరించారు. కిషోర బాలికల చేత బాల్య వివాహాల నిర్మూలన కొరకు ప్రతిజ్ఞ చేయించి వాటికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరింప చేశారు. అనంతరం బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ భారతి, ఈ ఓ పార్టీ శైలజా రాణి, సూపర్వైజర్లు సునాలిని, మధుమాలిని, రాజమణి, శాంతమ్మ, లావణ్య, కార్యకర్తలు శ్రీదేవి, భారతి, జరీనా బేగం, నాగమణి, రామాంజనమ్మ, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశంలో సామాజిక న్యాయానికి ఇప్పటికీ ఎప్పటికీ ది కూచి నవాబుపేటమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి:ఎ ( జనం రిపోర్టర్ ) : మొట్టమొదటి సారిగా బ్రిటిష్ పాలకుల వివక్ష నుండి స్వతంత్రం కోసం పాణాల అర్పించిన యోధులు బ్రిటిష్ పాలకుల ను తరిమి కొట్టి దేశానికి స్వతంత్రం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది ఆనాటి నుండి భారతదేశంలో ఉన్న ప్రజల కోసం హరియాశలు శ్రమించి దేశాన్ని ఒక క్రమంగా పద్ధతిలో అన్నిటిలో అభివృద్ధిలో ముందుకు ప్రయాణం చేసింది భారత కాంగ్రెస్ పార్టీ నే కానీ నేటిబి జె పి పాలనలో మన భారతదేశం ఎటు ప్రయాణం చేస్తుందో ఎవరికి అర్థం కావడం లేదు . ప్రభుత్వ రంగ సంస్థలను అన్నిటినీ కార్పొరేట్ కంపెనీల కు తాకట్టు పెడుతుంది బీజేపీ డియా ప్రభుత్వం వచ్చి నేటికీ ఒక సంవత్సరము పూర్తయింది కానీ140 కోట్ల మంది భారతీయులు నమ్మకం కోల్పోయింది బి జె పి పాలనలో ఈ రోజు కు మణిపూర్ రాష్ట్రంలో ఇంకా చాలా రాష్ట్రాల్లో పేదలుమరింత నిరుపేదలుగా నే జీవిస్తున్నారు దేశ ప్రజలు సంపద అంతా సంపన్నుల కార్పొరేట్ కంపెనీలో బంది అయింది.

# రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ..



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : పంట భూమిలోని భూసారాన్ని పెంచే క్రమంలోభాగంగా రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామంలోనీ రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. జీలుగ,50% రాయితీతో 58, క్వింటాళ్లు, జనుము రాయితీతో,40 కింట్వాళ్ళు, విత్తనాలను రైతులకు అందుబాటులోకి ఉన్నాయని ఏడీఏ రామకోటేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నూరు ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు ,గుంటూరు పార్లమెంటు రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బోద్రు రామారావు, డి సి ప్రెసిడెంట్ గనిఫిశెట్టి రామకృష్ణ, సౌపాటి వెంకట్రావు, ఏవో దేగల వెంకటరామయ్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# పవన్ చొరవతో గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు



మొగల్లూరు, ( జనం రిపోర్టర్ ) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో మొగల్తూరు గ్రామాభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయని పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. గ్రామాభివృద్ధిపై మార్చి 28న నేరుగా రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్న మొగల్తూరు పంపి సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలు తెలుసుకున్నారన్నారు. వెనువెంటనే మొగల్తూరు ఉన్నత పాఠశాలకు రూ.1 కోటి 71 లక్షలుతో అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్, పాతకాలువ సెంటర్ లలో రెండు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు నిర్మాణానికి రూ.12లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.90కోట్లుతో అంచనాలు రూపొందించామని ఈపనులకు తొలివిడతగా రూ.10 కోట్లు మంజూరుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. గ్రామంలో కళ్యాణ మండపం నిర్మాణాలకు మలివిడత నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఈసమావేశంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, వార్డు సభ్యులు పొన్నపల్లి లక్ష్మీ, కొండా ఆదాము ముక్కు గోపాలకృష్ణ, మద్దూరి పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

# క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ



చొప్పదండి, ( జనం రిపోర్టర్ ) : చొప్పదండి లో ప్రతి సంవత్సరం నిర్వహించే చొప్పదండి ప్రీమియర్ లీగ్ 4వ సీజన్ సందర్భంగా పట్టణంలోని 13వ వార్డ్ టీమ్ సభ్యులకు టీషర్ట్స్ స్పాన్సర్ చేయడం జరిగిందని బిజెపి నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడాకారులు ఆటల్లో బాగా రాణించి కప్ సాధించాలని వారిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమం లో కార్యక్రమ నిర్వాహకులు రాజిరెడ్డి,సందీప్ క్రీడాకారులు మైపాల్, శ్రీరామ్, కన్నయ్య, ఇమ్రాన్, సాయి, శ్యామ్, వంశీ, ప్రశాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు

# కౌలు రైతు కార్డుల పై అవగాహన సదస్సు



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : నగరం మండలం లో అద్దంకివారిపాలెం ధూళిపూడి నార్త్ సచివాలయంల పరిధిలో నగరం మండలం తహశీల్దార్ .నాంచారయ్య అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రంల పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.తహశీల్దార్ నగరం నాంచారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కౌలు రైతులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందటానికి ఈ కార్డు తీసుకున్న ప్రతి కౌలు రైతు కి 11 నెలల వరకు పండించే పంట పై హక్కు కలిగి వుంటాడని తెలిపారు. ఈ %జజ=జ% కార్డులు అందజేయుటకు కౌలు రైతులు ను గుర్తించి ప్రతి కౌలు రైతు కి %జజ=జ% కార్డ్ అందజేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి %ఎ%.రమేష్ బాబు మాట్లాడుతూ ఈ కౌలు రైతు కార్డ్ పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వచ్చే అవకాశం ఉంటుందని అందులో అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవడానికి , పంట రుణాలు పొందటానికి ఈ %జజ=జ% కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. కావున గ్రామాలలో ప్రతి కౌలు రైతుకు తెలియజేసి ఈ %జజ=జ% కార్డు పొందేలా చూడాలని తెలిపారు. ఈ కార్డు కోసం కౌలు రైతులు మీ సచివాలయం లోని గ్రామ రెవెన్యూ అధికారి నీ సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ %చీ%. సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు,అద్దంకివారిపాలెం గ్రామ సర్పంచ్ %ఎ%. పావని, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు...

## తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా నియమితులైన సి.ఎం.డి. సందీప్ కుమార్ సుల్తానియా ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 13. సి.ఎం.డి సందీప్ కుమార్ సుల్తానియా ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా నియమితులైన నేపథ్యంలో, రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుల్తానియా పాలనాపరమైన అనుభవం, పరిపక్వత, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో విశిష్టమైన పేరు సంపాదించుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో వివిధ పదవుల్లో బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందిన ఈ నిజాయితీ పరుడు, ఫైనాన్స్ శాఖ వంటి కీలక విభాగానికి మార్గనిర్దేశకుడిగా, నియమితులవడం రాష్ట్ర అభివృద్ధికి గొప్ప శుభపరిణామం." అని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడేలా, పారదర్శకత,సమర్థతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి సుల్తానియా తన సత్తా చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన తీసుకొచ్చే విధానాలు, నిర్ణయాలు, వనరుల సమర్థ వినియోగం ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మరింత మెరుగుపరుస్తాయని ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేలా, అభివృద్ధి ప్రణాళికల్లో పాల్గొనేటటువంటి ఆర్థిక సహాయాల సమీకరణకు సుల్తానియా మార్గదర్శకత ఉపయుక్తంగా నిలుస్తుందని అన్నారు. ఆయన అనుభవం, విజ్ఞానం ప్రజలకు ప్రయోజనకరంగా నిలుస్తుందన్న నమ్మకం వ్యక్తం చేశారు."మానవీయత, సమర్థత, నియమ నిబద్ధత కలిగిన నాయకత్వానికి ప్రతీక అయిన సుల్తానియా సేవలు మా రాష్ట్రానికి వరంగా నిలవాలని, ఆకాంక్షిస్తున్నాను" అని రాజ్ ఠాగూర్ పేర్కొన్నారు. తుదకు... సుల్తానియా కి కొత్త బాధ్యతలలో విజయాల వృద్ధిని కోరుతూ, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర మరింత గణనీయంగా ఉండాలని ఆకాంక్షించారు.వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## అన్నదాత సుఖీభవ పథకాన్ని నమోదు చేసుకోవాలి

పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : మండల మండల వ్యవసాయాధికారిణి పి. సంధ్యారాణి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి అడంగల్ ఆధార్ జిరాక్స్ కాపీలతో రైతు సేవా కేంద్రాలలో తమ పేర్లను ఈనెల 20వ, తేదీలోపుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.


## ఓసిపి-5 ఈపి ఆపరేటర్ల రెస్ట్ షెల్టర్ లో ఏసి పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వండి.....

### ఓసిపి-5 ప్రాజెక్టు మేనేజర్ కు వినతి పత్రం ఇచ్చిన ఈ.పి ఆపరేటర్లు....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 13. సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి -5 లోని ఈ.పి ఆపరేటర్ ల రెస్ట్ షెల్టర్ లో ఏసి ఏర్పాటు చేసుకునేందుకు, మంగళవారం ప్రాజెక్టు మేనేజర్ కు రిలే సికి చెందిన ఈ.పి.ఆపరేటర్ లు వినతి పత్రం అందజేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా రెస్ట్ షెల్టర్ లో ఫ్యాన్ గాలి వల్ల వడ గాలి రావడం తో ఆపరేటర్ లు అస్వస్థతకు గురౌతున్నారని, ఇట్టి ఏసి ని తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుంటామని, దీనికి సంబంధించిన అనుమతి ఇవ్వవలసిందిగా ఈ.పి ఆపరేటర్లు ప్రాజెక్టు మేనేజర్ ను కోరడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్, ఏఐటియుసి సీనియర్ నాయకులు గండి ప్రసాద్, రాయుడు శ్రీనివాస్, చింతపండు సత్యనారాయణ తో పాటు రిలే సి ఈపీ ఆపరేటర్స్ పాల్గొన్నారు .

## ప్రశాంతంగా ముగిసిన శ్రీ మొగధారమ్మ తల్లి అమ్మవారి సిడిమాను ఉత్సవాలు



నిజాంపట్నం. ( జనం రిపోర్టర్ ) : గ్రామ దేవత శ్రీ మొగధాలమ్మ తల్లి సిడిమాను ఉత్సవాలు ఈనెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులు, గ్రామ ప్రజలు జరుపుకున్నారు. నిజాంపట్నం నుండే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా తదితర ప్రాంతాల నుండి కూడా భక్తులు, వేలాది మంది తరలివచ్చి ఉత్సవాలలో పాల్గొని ఘనంగా జరుపుకున్నారు. అయితే ఈ ఉత్సవాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు తలెత్తకుండా నిజాంపట్నం ఎస్సై కే. తిరుపతిరావు జిల్లా పోలీస్ అధికారులలి ఆదేశాలతో రెండు వందల మంది పైగా పోలీస్ సిబ్బంది తో బందోబస్తులి ఏర్పాటు చేసీ తిరునాళ్ళ జరిగిన ఐదు రోజులు ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారులి . అలాగే పారిశుధ్యంలి ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి మరియు ఈవోపీఆర్డి ఎం. రవిశంకర్ ఆదేశాల మేరకు నిజాంపట్నం కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తన సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు గ్రామంలోనిలిచి ఉన్న చెత్తను పంచాయితీ వాహనాలతో తరలించి భక్తులకు ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని కలిగించారు. అలాగే విద్యుత్ శాఖలి నిజాం పట్నానికి విద్యుత్ ఏఈ అధికారి లేనప్పటికీ ఉన్న సిబ్బందితోనే ఎప్పటికప్పుడు విద్యుత్తులో చిన్న చిన్న అంతరాయాలు కలిగినప్పటికీ వాటిని సరి చేసుకుంటూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందజేశారు. మరియు వైద్యశాఖలి వైద్య సిబ్బంది ఈ ఐదు రోజులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి తలనొప్పి, జలుబు, వాళ్లు నొప్పులు, మొదలగు చిన్న చిన్న సమస్యలకి మందులు పంపిణీ చేశారు.మొగధారమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ కన్నా శ్రీనివాసరావు మరియు కమిటీ పెద్దలు వాలంటరీలను నియమిచి సిడిమొను ఉత్సవాలలో పాల్గొని ప్రశాంతంగా జరిగాలా వారి సేవలు అందించారు. భక్తులు వేలాదిమంది తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మొత్తానికి ఉత్సవాలు ప్రశాంతంగా జరగటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## మే13 నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఎమ్మెల్యే శిరీషా దేవి



రాజవొమ్మంగి,రంపచోడవరం మే 13 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి విజయభాస్కర్ గత సంవత్సరం కూటమి ప్రభుత్వం,తన విజయ దుందుభి గూర్చి మంగళవారం మాట్లాడుతూ మే 13 వ తేదీని నేను ఎప్పటికీ మర్చిపోలేనని గత సంవత్సరం ఇదే రోజున మీరు నాపై నమ్మకం ఉంచి ఓటు వేసి నాకు అఖండ విజయాన్ని అందించి, ప్రజా సేవకు ఒక గొప్ప అవకాశం ఇచ్చారని ఆమె పేర్కొన్నారు నియోజకవర్గం ప్రజలు విలక్షణమైన తీర్పుతో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ఇచ్చారని రంపచోడవరం నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని మెజారిటీని అందించినందుకు, ఈ విజయాన్ని సాధించడానికి మీరు చూపిన ఆదరణకు, మమ్మల్ని నమ్మి ఇచ్చిన ఆమోదానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ గడిచిన సంవత్సరంలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నేను అనునిత్యం కృషి చేస్తున్నామన్నారు మీరు చూపిన ప్రేమ,ఆదరణ, నాకు శక్తిని ఇచ్చాయని చెప్పారు ప్రజల కోసమే పని చేయాలన్న అభిమానం నాకు ప్రతి రోజూ ప్రేరణగా మారింది తెలిపారు గత సంవత్సరం ఈరోజు మన ప్రజాస్వామిక విజయానికి గుర్తుగా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆమె అన్నారు మీరు చూపిన ఆశీర్వాదం ఎల్లప్పుడూ నా మీద ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనా



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : మే 20 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా లోని భవన నిర్మాణ కార్మికులు, అందరు ప్రతి మండల, జిల్లా కేంద్రాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో టి యు సి ఐ సి ఐ టి యు ఏఐటియుసి ఐ ఎన్ టి యు సి బి ఆర్ టి యు నాయకులు సి రాజు, ఆర్ ఎన్ రమేష్, బుచ్చన్న, ప్రేమ రత్నం, శ్యాంసుందర్, భాస్కర్, ప్రభుదాసు, అబ్రహాంలు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కొడ్స్ ను రద్దు చేయాలనీకార్మిక సంఘాల ప్రతి నిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ ని నియమించాలనీ, బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమ%శీ% కోసమే ఖర్చు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రమాద మరణానికి 10 లక్షలు, సహజ మరణానికి 5 లక్షలు దహన సంస్కారాల ఖర్చు, డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్ లకు ఇచ్చే సంక్షేమ రూపాయలను 1 లక్ష కు పెంచాలన్నారు. కనీస పెన్షన్ నెలకు 9 వేలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయు కె ఎస్ జిల్లా అధ్యక్షులు కె రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్,మున్సిపల్ జిల్లా అధ్యక్షులు ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా నూతన ఎస్టీకమిషన్ చైర్మన్ను కలిసిన గొల్లపూడి పెద్దిరాజు



రాజవొమ్మంగి, మే 13 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు మంగళవారం నూతన ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు మీనాయకత్వంలో ఎస్టి సముదాయానికి సమగ్ర అభివృద్ధికి,హక్కుల పరిరక్షణకు ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిలానీ తదితరులు పాల్గొన్నారు

## దేశవ్యాప్త సమ్మెపై ఆత్మకూరులో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



ఆత్మకూరు వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆత్మకూరు మండల కేంద్రంలోనీ ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం కార్మిక సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ రాజు టి యు సి ఐ జిల్లా నాయకులు ప్రసాద్ ఏఐటీయూసీ నాయకులు కామ్రేడ్ మోష పాల్గొని కార్మికుల డిమాండ్ల గురించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికుడికి 26 వేల వేతనం ఇవ్వాలని పిఎఫ్ గ్రాటివిటీ చట్టాన్ని అమలు చేయాలని అసంఘటితరంగా కార్మికులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఫలితాలు అందాలని ఉపాధి హామీలో పని చేసే కార్మికులకు రోజు కూలి 600 ఇవ్వాలని సంవత్సరం పొడుగునా పని కల్పించాలని ఉపాధి హామీలో సిబ్బంది పెండింగ్ బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలపై ఈ నెల 20న సార్వత్రిక సమ్మె జరుగుతుందని అన్ని రంగాల కార్మికులు వ్యవసాయ కూలీలు బీడీ కార్మికులు హమాలీ కార్మికులు మున్సిపల్ మరియు అంగన్వాడి ఆశా వర్కర్స్ తదితర రంగాలకు చెందిన కార్మికులంతా ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయుడు వెంకటన్న చెన్నప్ప మమ్మదు బాలకృష్ణ నాగన్న బాలకృష్ణ వెంకటన్న రాములు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000/- విరాళం



పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు వాస్తవ్యులు శ్రీమతి బైరపనేని జయమ్మ జ్ఞాపకార్థం వారి భర్త శ్రీ బైరపనేని నరసింహారావు మరియు వారి కుమారులు సీతారామయ్య, మల్లికార్జునరావు మంగళవారం ఉదయం దేవస్థాన నిత్య అన్నదాన పథకమునకు రూ.1,00,000/- విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయఅభివృద్ధికి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేసినారు. దాతలకు ప్రత్యేక దర్శనం,వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు. సం/- గోగినేని లీలా కుమార్,ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి.

## అర్హులైన పాడి రైతులకు ప్రభుత్వం 50% రాయితీతో దాన పంపిణీ



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బెల్లంకొండ. నాంచారయ్య ఆధ్వర్యంలో అర్హులైన పాడి రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50% రాయితీ తో పశు దాణా ని అందిస్తుంది..రేపల్లె టౌన్ మరియు రూరల్ మండలం లో ఈ రోజు పాడి రైతులకు గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ మంత్రి వర్యులు అనగాని సత్య ప్రసాద్ ఆదేశాలు ప్రకారం మంత్రి గారు సోదరులు శ్రీ. అనగాని. శివ ప్రసాద్ చేతులు మీద గా ఈ రోజు 21 టన్నుల పశు దాణా ని పంపిణీ చెయ్యటం జరిగింది... ఆయన మాట్లాడుతూ పాడి పశువుల దాణా ప్రతి పాడి రైతు కు ధీమా అని అన్నారు. ప్రభుత్వం పాడి రైతులు ఆదుకోవడానికి పశు సంవర్ధక శాఖ వారి ద్వారా పశు దాణా(50%సబ్సిడీ) మరియు మినీ గోకులములు (పశువులకు షెడ్ లు 90%సబ్సిడీ) తో అందిచటం జరుగుతుంది అని ఈ అవకాశాన్ని నియోజకవర్గం లో వున్నా ప్రతి పాడి రైతు ఉపయోగించుకోవాలని తెలియచేసారు... ఈ కార్యక్రమం న కు...రేపల్లె మండల పశువైద్యాధికారి డాక్టర్. ప్రవీణ్ కుమార్ , బొబ్బర్లంక పశువైద్యాధికారి డాక్టర్. పి. మీనాక్షి దేవి , కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమ ప్రియా , గుత్తవారిపాలెం పశు వైద్యాధికారి డాక్టర్. రోషన్ బేగ్ , పార్టీ నాయకులు పంతాని. మురళీధరరావు , మత్తి. భాస్కరరావు కొలసాని రాము గోగినేని రామారావు . పాడి రైతులు పాల్గొన్నారు...

## అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న ఆత్మకూరు పోలీసులు



ఆత్మకూరు వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామ శివారులో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం సాయంత్రం పట్టణ ఎస్సై నరేందర్ సిబ్బందితో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్ స్టేషన్ కి తరలించినట్లు ఎస్సై తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను తహ సిల్దార్ షేక్ చాంద్ పాషాకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ రేపల్లె బ్లడ్ బ్యాంక్ సందర్శన

రేపల్లె ( ( జనం రిపోర్టర్ ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్స్ శ్రీ యార్లగడ్డ దశరథ రామారావు ఈరోజు ఉదయం 11 గంటలకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోని ఆవరణలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ని సందర్శించి పనితీరు పరిశీలించి తగు సూచనలు చేసినారు. రాబోయే కాలంలో గౌరవ మంత్రివర్యులు శ్రీ అనగానే సత్య ప్రసాద్ పూర్తి సహకారంతో నాట్కో ఫార్మా విరాళంతో కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంక్ చేయటానికి తమ వంతు సహాయ సహకారాలు తెలియజేశారు. రేపల్లె బ్లడ్ బ్యాంక్ పనితీరు బాగుందని ఇంకా బ్లడ్ డొనేషన్లు, ఇష్యులు పెంచుకోవాలని, రేపల్లె బ్లడ్ బ్యాంక్ 10 సోలార్ ప్లాంట్ ని గతంలో రామారావు ఇప్పించినారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ రేపల్లె బ్లడ్ బ్యాంక్ సందర్శనఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్స్ శ్రీ యార్లగడ్డ దశరథ రామారావు గారు ఈరోజు ఉదయం 11 గంటలకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోని ఆవరణలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ని సందర్శించి పనితీరు పరిశీలించి తగు సూచనలు చేసినారు. రాబోయే కాలంలో గౌరవ మంత్రివర్యులు శ్రీ అనగానే సత్య ప్రసాద్ పూర్తి సహకారంతో %చీఫ్ఎశీ% ఫార్మా విరాళంతో కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంక్ చేయటానికి తమ వంతు సహాయ సహకారాలు తెలియజేశారు. రేపల్లె బ్లడ్ బ్యాంక్ పనితీరు బాగుందని ఇంకా బ్లడ్ డొనేషన్లు, ఇష్యులు పెంచుకోవాలని, రేపల్లె బ్లడ్ బ్యాంక్ 10 సోలార్ ప్లాంట్ ని గతంలో రామారావు గారు ఇప్పించినారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు, కరిముల్లా, శ్రీనివాసు,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు. డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,

## సంపూర్ణ ఆరోగ్యంతోనే అద్భుత విజయాలు జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం

రామడుగు, ( జనం రిపోర్టర్ ) : సంపూర్ణమైన ఆరోగ్యాన్ని కలిగినప్పుడే జీవితంలో ఎన్నో అద్భుత విజయాలు సాధించవచ్చు అని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్(టి పీ ఏ) జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం అన్నారు.రామడుగు మండల కేంద్రంలోని బెరాకా చర్చిలో వ్యాలీ ఆఫ్ బెరాకా మినిస్ట్రీస్ అద్వర్యములో విశ్వ ప్రగామి ఫౌండేషన్ వారు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషి శారిరముగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా , ఆర్థికంగా బాగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా పరిగణించబడుతుందని అన్నారు .. మానసిక ఆరోగ్యం మనిషికి మనో ధైర్యాన్ని సంపూర్ణమైన అవగాహనతో ముందుకు పోయే విధంగా సహకరిస్తుందని అన్నారు... సందర్భంగా ఆరోగ్యం అంటే ఏమిటి, ఆహార అలవాట్లు, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు.. పెరటితోట, చెట్ల గూర్చి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ అవగాహన కల్గించారు.. సందర్భంగా పెరటి మొక్కల విత్తనాలను పంపిణీ చేశారు కార్యక్రమంలో పాస్టర్ అబ్రహాము, , తదీతరులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ..



పొన్నూరు మే 13 .జనం రిపోర్టర్:వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సహకారంతో, రూ:10,15,375 లక్షల రాయితీతో యంత్ర పరికరాలను సోమవారం పొందూరు మండలం దుప్పలపూడి రైతు సేవ కేంద్రంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. 1. తైవాన్ స్ప్రేయర్లు - 43 .,2. ఎద గొర్రులు - 7.,3. 9 చెక్కల గొర్రులు - 9.,4. పల్టీ నాగళ్ళు - 1., 5. రోటావేటర్ -1.,6. పవర్ టిల్లర్ ,7. లెవెలింగ్ బ్లేడ్ -1మొత్తం 63 యంత్ర పరికరాలను పొన్నూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు(లబ్ధిదారులకు) అందజేశారు. రైతులు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే యంత్ర పరికరాలను, పచ్చి రొట్టె విత్తనాలను రాయితీపై అందించడం చాలా ఆనందంగా ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఎల్లప్పుడు మాకు అండదండగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర యస్.సి కార్పొరేషన్ డైరెక్టర్ ,పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, గుంటూరు పార్లమెంట్ రైతు విభాగ ప్రధాని కార్యదర్శి బొర్రు రామారావు, డిసి ప్రెసిడెంట్ గనిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు రెగ్యులర్ పొన్నూరు వి .రామకోటేశ్వరి, పొన్నూరు మండల వ్యవసాయ అధికారి దేగల వెంకట్రామయ్య, అగ్రికల్చర్ రైతు సేవా కేంద్రాల సిబ్బంది , వివిధ గ్రామాల రైతులు , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి.: ఆర్డీవో దాసిరాజు.



మొగల్తూరు. మే13 జనం రిపోర్టర్: గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో దాసి రాజు ఆదేశించారు. మండలంలోని కె.పి .పాలెం గ్రామంలో చేపట్టిన రీ సర్వేపై అధికారులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రీ సర్వేలో ప్రతీ రైతు సరిహద్దుదారులు అధికారులకు సహకరించాలన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సర్వేయర్ ధనరాజ్ ,డిటి నాగేశ్వరరావు, ఇన్చార్జ్ ఆర్ ఐ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలోవైభవంగా ఎల్లమ్మ జాతర బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు



చిగురుమామిడి (జనం రిపోర్టర్): ముదిమణిక్యం గ్రామం లో గౌడ సంఘం అధ్యక్షులు ముంజ వెంకన్న గౌడ్ మరియు గౌడ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర వైభవంగా సాగుతున్నది. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఈ జాతరకు గ్రామం లోని భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చరు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం లో అమ్మవారికి పంచామృతాలు, గంగాజలంతో అమ్మవారికి అభిషేకించి ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు. గ్రామం లోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు పంబల వారి నృత్యాలు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి పంబాలవారు బోనాల చుట్టూ బలి వేస్తూ మేక పిల్లను గావు పడుతూ చూపరులను ఆకట్టుకున్నాయి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పంటలు బాగా పండాలని, పిల్లా పాపలను చల్లంగా చూడాలని రైతులు కోరుతూ అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆలయం చుట్టూ ప్రదిక్షిణలు చేపట్టారు. ఊరేగింపులో భక్తులు భండారు (కుంకుమ, పసుపు, గవ్వలు) చల్లుతూ అమ్మవారిని దర్శనం చేరుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో జాతర సందర్భంగా మిఠాయి, టెంకాయలు, చిన్నారుల ఆటవస్తువుల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయయి.

## మంచినీటి శుద్ధి కి స్థలం కేటాయించాలి.



మొగల్తూరు, మే13 జనం రిపోర్టర్: విజ్జేశ్వరం నుండి నేరుగా పైప్ లైన్ ద్వారా మంచినీటి ప్రాజెక్టులకు నీటి సరఫరా చేసి ఆనీటిని శుద్ధి చేసేందుకు మంచినీటి ప్రాజెక్టు వద్ద స్థలం కేటాయించాలని మెగా కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శికి మం గళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు తో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజ్జేశ్వరం నుండి నేరుగా మంచినీటి ప్రాజెక్టులకు పైప్ లైన్ నేరుగా నీటిని సరఫరా చేసే ఒప్పందం మెగా కన్‌స్ట్రక్షన్స్ ప్రభుత్వంతో కుదిరిందన్నారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని ఇందుకు మొగల్తూరు, పేరుపాలెం సౌత్ గ్రామాలకు సంబందించి సంపు, ఓహెచ్ఎర్ నిర్మాణాలకు య. 6.5 సెంట్లు స్థలం కేటాయించాలని కోరుతూ వినతిని అందించారు.

## సీబీఎస్సీ పదవ తరగతి ఫలితాల్లో రేవతి హై స్కూల్ విజయభేరి




రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ శంకర్‌పల్లి (జనం రిపోర్టర్) :తెలంగాణ సీబీఎస్సీ పదవ తరగతి ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేవతి హై స్కూల్ విద్యార్థులు విజయడంకా మోగించారు. పట్టణ పరిధిలోని 15 వ వార్డు సాయి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గండేటి వెంకటేష్ గౌడ్, సౌమ్య కుమారుడు తేజస్ చంద్ర గౌడ్ 500 మార్కులకు 490 మార్కులు సాధించాడు. అదే విధంగా సిహెచ్ హాసిని 476, జి పూజిత 469, వై అక్షయ 468, జె పూజిత 459 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ పావని.. తేజస్ చంద్ర గౌడ్ విద్యార్థికి మేమెంటో అందజేసి, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. తేజస్ చంద్ర గౌడ్ మాట్లాడుతూ తాను రోజుకు 4-5 గంటలు చదివే వాడినని తెలిపాడు. టాపిక్ అర్థం చేసుకోవడంపైనే ఫోకస్ చేశానన్నాడు. ఈ క్రెడిట్ తల్లిదండ్రులు, టీచర్లకే దక్కుతుందని చెప్పాడు.

## జూన్ 5 లోపు ఐ.ఐ.హెచ్.టి. లో ప్రవేశం కొరకు దరఖాస్తు సమర్పించాలి...

### చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్.....

రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 13. జూన్ 5 లోపు ఐ.ఐ.హెచ్.టి. లో ప్రవేశం కొరకు దరఖాస్తు సమర్పించాలని, చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం నందు మంజూరైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు మొదటి సంవత్సరం 2025-26 తెలంగాణ రాష్ట్రానికి 9 సీట్లు కేటాయించారని, చేనేత టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐ.ఐ.హెచ్.టి) బరఘ నందు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లోమా కోర్సు కు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, 17 నుంచి 25 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన యువకులు తమ దరఖాస్తులను సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ కరీంనగర్ కార్యాలయానికి జూన్ 5 లోపల సమర్పించాలని చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోతులను నిర్మూలించే దిశగా ఏలేశ్వరం నగర పంచాయతీ





ఏలేశ్వరం,(జనం రిపోర్టర్) :ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని నివాసాల్లో దాడికి దిగుతున్న కోతుల నిర్మూలించేందుకు ఏలేశ్వరం నగర్ పంచాయతీ నడుంబిగించింది. ఈ సందర్భంగా 350 కోతులను బోన్లో బంధించారు. ఈ సందర్భంగా నగర్ కమిషనర్ ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని కోతుల బెడద ఎక్కువైంది అన్నారు. సమూహాలుగా వచ్చిన కోతులు నివాస గృహాలలోనికి ప్రవేశించి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతోపాటు ఇంట్లో సామాన్లు బీభత్సం చేస్తున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో దాడికి దిగి అనేకమందిని గాయపరిచాయన్నారు. సమూహాలుగా దాడికి పాల్పడుతున్న కోతులను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను రప్పించి బోలో బంధిస్తున్నామన్నారు. ఎప్పటి వరకు సుమారు 380 కోతులను బోన్ లో బంధించినట్లు చెప్పారు. కాగా వాటిని అడవి ప్రాంతాల్లో సురక్షితంగా విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

## ప్రభుత్వ వైద్యశాలలో పాముల కలకలం..




పొన్నూరు మే 13. జనం రిపోర్టర్:పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో పాముల కలకలం సిబ్బందితోపాటు రోగులను భయపెడుతున్నాయి. వైద్యశాల చుట్టుపక్కల ముళ్ళపోదలు,పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములకు ఆవాసాలుగా మారింది. ప్రతిరోజు వైద్యశాలకు రోగులు వస్తూ విశ్రాంతి కొరకు చెట్ల కింద కూర్చుంటారు. పాములు ఎటునుంచి వచ్చి కాటు వేస్తాయోనని భయపడుతున్నారు. మంగళవారం సిబ్బంది రెండు పాములను గుర్తించి చంపివేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

## : గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా ఆంజనేయ స్వామి అభిషేక పూజలు..

### కోహెడ రామాలయంలో వెళ్ళివేరిసిన ఆధ్యాత్మికథ..




కోహెడ జనం న్యూస్ :సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం రామాలయంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ మహా స్వామికి మంగళవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు డాక్టర్ కోహెడ ప్రసాద రావు వైధిక పూజలు నిర్వహించారు. గవ్వ వంశీధర్ రెడ్డి దంపతులు శ్రీ హనుమాన్ మహాస్వామికి పంచామృత అభిషేకం, మన్యు సూక్త అభిషేకం, షోడష ఉపచార పూజలు, అవధారాలు మంత్ర పుష్పం, మంగళ హారతులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాల దారులకు బిక్ష వితరణ భక్తులకు అన్నప్రసాద వితరణ చేసారు. ఈ సందర్భంగా గవ్వ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ మాల, ఆంజనేయ స్వామి మాలదారణ, హిందూ సంస్కృతిలో బాగమని ప్రేమ , శాంతి, తోటివారికి సేవచేయాలనే సంకల్పం పెరుగుతుందని ఇలాంటి కార్యక్రమాల వల్ల హిందువుల ఐక్యత పెరుగుతుంది అన్నారు, అలాగే ప్రజలందరూ ఆ ఆంజనేయ స్వామి ఆశీర్వాదముతో సుభిక్షంగా ఉండాలి, ప్రజలందరూ పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో ఈ పూజలు నిర్వహించామని భవిష్యత్తులో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యా, వైద్యం ఆధ్యాత్మిక రంగాలలో విస్తృతంగా సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గవ్వ కిషన్ రెడ్డి,వలుస సుభాష్, వేముల వీర స్వామి,కాటం సంపత్ రెడ్డి, సంజీవరెడ్డి,యువసేన సభ్యులు మొలుగూరి హరికృష్ణ,గుగ్గిళ్ల కార్తీక్ మద్రి అనిల్,భీమ్రెడ్డి జీవన్ రెడ్డి,గడిపే సుజిత్,కొనవేణి బాలకిషన్,మాజీ ప్రజా ప్రతినిధులు,హనుమాన్ మాలా దారులు పలు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# పెదకాకాని లో రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లే కొనుగోలు చేస్తున్న వైనం









పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : పెదకాకాని మండలంలో అగతవరపాడు పంచాయతీ పరిధిలో రేషన్ డీలర్ మరియు రేషన్ సప్లై చేసే వాహనం దారుడు ఆ రేషన్ బియ్యం కొనుగోలు చేసి వారి చేతివాటం చూపిస్తున్నారు పేదల బియ్యం పెద్దల పాలు గద్దల తనకు పోతున్నారు కేజీ ?10 చొప్పున కొనుగోలు చేసే అక్రమదారులకు 30 రూపాయలు చొప్పున అమ్ముకుంటున్న వైనం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపటానికి ఇస్తున్నటువంటి బియ్యాన్ని పేదల పొట్టలు కొట్టి డీలర్లు లక్షల సంపాదిస్తున్నారు వారి కడుపులో నింపుకుంటున్నారు ఒక పక్కన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా రేషన్ దళారీ వ్యవస్థ పైన రేషన్ అక్రమంగా తరలించిన వారి పైన రేషన్ అమ్ముకుంటున్న వారి పైన క్రిమినల్ చర్యలు రౌడీషీట్లు తెరుస్తామని చెప్పినటువంటి ముఖ్యమంత్రి మాటలను పట్టించుకోకుండా దళారులు పెడచెవిన పెట్టినటువంటి వైనం ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన ఆయన మాటలను లెక్కచేయకుండా పేదల కడుపు కొడుతున్నారు ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడిన వారం రోజుల్లోనే

పెదకాకాని మండలంలో ఉన్నటువంటి అగతవరపాడులో ఉన్నటువంటి రేషన్ షాప్ నెంబర్ 22 గల షాపు నందు డీలర్ షాప్ నిర్వహిస్తున్నటువంటి నారాయణమూర్తి మరియు రేషన్ సప్లై చేస్తున్నటువంటి ఎస్. కే .దాదావాలి వాహనదారుడు రేషన్ సప్లై చేస్తున్నటువంటి ఇద్దరు కలిసి పేదలకు అందించాల్సిన బియ్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా వాహనదారులే డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నటువంటి వైనం కొనుగోలు చేసినటువంటి బియ్యాన్ని దళారులకు ఎక్కువ మొత్తంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి పెదకాకాని మండలం ఉన్నటువంటి అధికారులు ముఖ్యమంత్రి మాటలను పెడచెవిన పెట్టినటువంటి వైనం ఒక పక్కన పోలీసులు గాని ఎమ్మార్వో కానీ అక్కడ ఉన్నటువంటి అధికారులు కూడా పట్టించుకోకుండా పేదలకు అందవలసిన బియ్యాన్ని అక్రమంగా అర్ధరాత్రి సమయంలో జిల్లాలు దాటిస్తున్నటువంటి పరిస్థితి రేషన్ మాఫియా లక్షల్లో సంపాదిస్తున్న ముడుపులను అధికారులకు చెల్లిస్తున్నట్టు ప్రజలు చెప్పుకుంటున్నారు నెలమామలు గుట్టుచప్పుడు కాకుండా అధికారులకు చేరవేస్తున్నట్టు డీలర్లు వాపోతున్నారు ఒక ప్రక్కన భారమైన వాహనదారుడు తప్పని పరిస్థితులలో బియ్యాన్ని కొనుగోలు చేసి ఖర్చుల నిమిత్తం కొని అమ్ముతున్నామని చెబుతున్నారు వాహనదారుడికి 18 వేల రూపాయలు అలాగే సహాయకుడికి ఎనిమిది వేల రూపాయలు ప్రతినెల ప్రభుత్వం చెల్లిస్తున్న జీతాలు అది చాలక పేదల బియ్యాన్ని అక్రమంగా కొని అక్రమంగా అమ్మికొని వారి జేబులో నింపుకుంటున్నారు ఈ విధంగా పెదకాకాని మండలంలో చుట్టుపక్కల ఉన్నటువంటి రేషన్ డీలర్ షాపులు మరియు వాహనదారులతో కుమ్మక్కై గుట్టు చప్పుడు కాకుండా బియ్యాన్ని కొనుగోలు చేస్తూ పేదల బియ్యాన్ని రాత్రికి రాత్రి అమ్ముకుంటున్నారు ఈ విధంగా చేస్తున్నటువంటి బియ్యాన్ని అమ్ముకుంటున్న వారి పైన క్రిమినల్ కేసులు రౌడీషీట్ తెరిచి రేషన్ షాపులు రద్దు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు మీడియాతో పంచుకున్న వారం రోజుల్లోనే ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం కోస మెరుపు ఈ విధంగా రేషన్ మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలని పేదల కడుపు నింపవలసిన రేషన్ బియ్యం ఎరవేసి పది నుంచి 12 రూపాయల మధ్యలో కొనుగోలు చేస్తున్నటువంటి దళారులను జిల్లా కలెక్టర్ గారు మండల స్థాయిలో ఉన్నటువంటి ఎమ్మార్వో గారు వీరి పైన కఠినమైన చర్యలు తీసుకొని రేషన్ను రేషన్ షాపులను సరైన మార్గంలో పేదలకు అందుబాటులోకి వచ్చే విధంగా వారికి అందించేలాగా చూడాలని ప్రజల కోరుకుంటున్నారు రేషన్ మాఫియాలో ఉన్నటువంటి రాజకీయ శక్తులను గుర్తించి వారికి సహకరిస్తున్నటువంటి రాజకీయ నాయకుల పైన కఠినమైన చర్యలు తీసుకొని వారి ఎంతటివారినైనా శిక్షించాలని వారిపైన కఠినమైన చర్యలు తీసుకొని రేషన్ షాపులను రద్దుచేసి పేదలకు అందించవలసిన రేషన్ను అందించవలసిందిగా ప్రజల కోరుకుంటున్నారు

## చేతులెత్తేసిన ఎక్సైజ్ శాఖ...




పొన్నూరు మే 13. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని వైన్స్ దుకాణంలో నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి విచ్చలవిడిగా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి మద్యం తాగిస్తున్నారు. వైన్స్ దుకాణం ముందు పర్మిట్ రూము ఏర్పాటు చేసి మద్యం తాగించడం వలన మందుబాబులు మద్యం మత్తులో రహదారిని వెళ్లే వారిని దూషిస్తూ పెద్ద పెద్ద అరుపులు కేకలతో ప్రయాణికులను భయపెడుతున్నారు. గత వారం ఇక్కడ మద్యం సేవించిన మత్తులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిపై పడి తీవ్ర ఇబ్బందులు గురి చేసినట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి పర్మిట్ రూమ్ ఏర్పాటుచేసిన స్థానిక ఎక్సైజ్ శాఖ షరా "మామూలే"అన్న చందనంగా మారటంతో వాహన చోదకులతో పాటు పాదాచారులు ఈ ప్రాంతం దాటాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్సైజ్ శాఖకు ప్రజలు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. పట్టణంలో నాలుగు వైన్ షాపుల యజమానులు వీరి ఉల్లంఘన పై రుస రుసలాడుతున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా నిబంధనల ఉల్లంఘన పై ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకొని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సిబిఎస్ 10 క్లాస్ ఫలితాల్లో సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ టౌన్ ఫస్ట్



నరసాపురం మే 13 జనం రిపోర్టర్ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో నరసాపురం పట్టణంలోని సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని .లాస్య శ్రీ 96.4 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచింది. మంగళవారం ఫలితాలు రావడంతో టౌన్ ఫస్ట్ సాధించిన లాస్య శ్రీ నీ సంసిద్ధ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ వి. లావణ్య మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ ర్యాంకులు అందిస్తున్నట్లు చెప్పారు.

## రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ రేపల్లె బ్లడ్ బ్యాంక్ సందర్శన



రేపల్లె (జనం రిపోర్టర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్స్ శ్రీ యార్లగడ్డ దశరథ రామారావు ఈరోజు ఉదయం 11 గంటలకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోని ఆవరణలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ని సందర్శించి పనితీరు పరిశీలించి తగు సూచనలు చేసినారు. రాబోయే కాలంలో గౌరవ మంత్రివర్యులు శ్రీ అనగానే సత్య ప్రసాద్ పూర్తి సహకారంతో నాట్కో ఫార్మా విరాళంతో కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంక్ చేయటానికి తమ వంతు సహాయ సహకారాలు తెలియజేశారు. రేపల్లె బ్లడ్ బ్యాంక్ పనితీరు బాగుందని ఇంకా బ్లడ్ డొనేషన్లు, ఇష్యులు పెంచుకోవాలని, రేపల్లె బ్లడ్ బ్యాంక్ 10 %ఎఎ% సోలార్ ప్లాంట్ ని గతంలో రామారావు ఇప్పించినారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ రేపల్లె బ్లడ్ బ్యాంక్ సందర్శనఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్స్ శ్రీ యార్లగడ్డ దశరథ రామారావు గారు ఈరోజు ఉదయం 11 గంటలకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోని ఆవరణలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ని సందర్శించి పనితీరు పరిశీలించి తగు సూచనలు చేసినారు. రాబోయే కాలంలో గౌరవ మంత్రివర్యులు శ్రీ అనగానే సత్య ప్రసాద్ పూర్తి సహకారంతో ఫార్మా విరాళంతో కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంక్ చేయటానికి తమ వంతు సహాయ సహకారాలు తెలియజేశారు. రేపల్లె బ్లడ్ బ్యాంక్ పనితీరు బాగుందని ఇంకా బ్లడ్ డొనేషన్లు, ఇష్యులు పెంచుకోవాలని, రేపల్లె బ్లడ్ బ్యాంక్ 10 సోలార్ ప్లాంట్ ని గతంలో రామారావు గారు ఇప్పించినారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు, కరిముల్లా, శ్రీనివాసు,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు. డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,

## కౌలు రైతు కార్డుల పై అవగాహన సదస్సు



రేపల్లె ( జనం రిపోర్టర్)నగరం మండలం లో అద్దంకివారిపాలెం ధూళిపూడి నార్త్ సచివాలయంల పరిధిలో నగరం మండలం తహశీల్దార్ %+%.నాంచారయ్య అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రంల పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. తహశీల్దార్ నగరం %+%. నాంచారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కౌలు రైతులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందటానికి ఈ కార్డు తీసుకున్న ప్రతి కౌలు రైతు కి 11 నెలల వరకు పండించే పంట పై హక్కు కలిగి వుంటాడని తెలిపారు. ఈ %జజ=జ% కార్డులు అందజేయుటకు కౌలు రైతులు ను గుర్తించి ప్రతి కౌలు రైతు కి %జజ=జ% కార్డ్ అందజేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి %ఎ%.రమేష్ బాబు మాట్లాడుతూ ఈ కౌలు రైతు కార్డ్ పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వచ్చే అవకాశం ఉంటుందని అందులో అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవడానికి , పంట రుణాలు పొందటానికి ఈ కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. కావున గ్రామాలలో ప్రతి కౌలు రైతుకు తెలియజేసి ఈ కార్డు పొందేలా చూడాలని తెలిపారు. ఈ కార్డు కోసం కౌలు రైతులు మీ సచివాలయం లోని గ్రామ రెవెన్యూ అధికారి నీ సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ %చీ%. సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు,అద్దంకివారిపాలెం గ్రామ సర్పంచ్ %ఎ%. పావని, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు...

## పుట్టినరోజున సేవే శ్రేష్ఠం

### హోప్ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు అన్నదానం



జనం రిపోర్టర్ (జనం రిపోర్టర్) :హైదరాబాద్‌కు చెందిన హోప్ ఫౌండేషన్ గౌరవ సభ్యులు శ్రీ ప్రభాకర్ గారు మరియు శ్రీమతి సుబ్బలక్ష్మి గారి కుమార్తె గీతా గారి పుట్టినరోజు సందర్భంగా, వారు నిజమైన ఆనందాన్ని పంచుకోవాలనే సంకల్పంతో ఓ మహత్తర సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గీతా గారి పుట్టినరోజు సందర్భంగా, వారి కుటుంబ సభ్యుల మద్దతుతో నలుగురు నిరుపేదులకు పౌష్టికమైన భోజనం అందించాలని నిర్ణయించగా, ఈ మంచిసంకల్పాన్ని అమ్మ దీవెన ఫౌండేషన్ వారు కార్యరూపం దాల్చారు. హోప్స్ ఫౌండేషన్ మరియు అమ్మ దీవెన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రోజు పొదిలిలోని కాలేజీ రోడ్డులో ఉన్న శ్రీపతి నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు నూరిపాళ్ల సంతోషం కలిగింది. ఒక్కొక్కరి ముఖంలో కనిపించిన సంతోషమే ఈ సేవ కార్యక్రమానికి నిజమైన విజయాన్ని సూచిస్తుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరో మందిలో మానవత్వాన్ని మేల్కొలిపేలా చేస్తాయి. సేవే శ్రేష్ఠమైన పూజ అని ఈ ఘటన మరొక్కసారి గుర్తుచేస్తోంది. గీతా గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి ఆదర్శ కార్యక్రమాలకు పునాదివేసిన కుటుంబానికి హృదయపూర్వక అభినందనలు.

## కీర్తిశేషులు స్వర్గీయ శ్రీ నందగిరి ప్రసాద్ గారి 4వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం



పొదిలి (జనం రిపోర్టర్) :జగిత్యాల వాస్తవ్యులు, మానవతా మూర్తి కీర్తిశేషులు శ్రీ నందగిరి ప్రసాద్ గారి 4వ వర్ధంతిని పురస్కరించుకుని, వారి అమూల్యమైన సేవా ఆత్మస్ఫూర్తిని స్మరించుకుంటూ, వారి కుటుంబ సభ్యులు ఒక మంచి కార్యానికి శ్రీకారం చుట్టారు. వారి ధర్మ పత్ని శ్రీమతి నందగిరి శ్యామల గారు, కుమారులు నందగిరి సునీల్ %-% నవ్యశ్రీ, నందగిరి మోహన్ %-% సౌజన్య, మనవళ్లు నందగిరి శ్రీమాన్, శ్రీహన్ష్ ప్రసాద్ కలిసి నలుగురు నిరుపేదలకు భోజనం అందించాలని సంకల్పించి, వారి ఆశయాన్ని నెరవేర్చారు. ఈ పుణ్య కార్యానికి హోప్స్ ఫౌండేషన్ మరియు దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యం వహించగా, పొదిలి పరిసర ప్రాంతాల్లో ఉన్న యాచకులు, నిరుపేదలకు మంచి భోజనం అందజేశారు. ఆకలితో బాధపడుతున్నవారికి ఆహారం అందించడం ద్వారా వారికి క్షణికమైన ఆనందాన్ని మాత్రమే కాక, మానవత్వం ఇంకా బతికే ఉందన్న ఆశను కలిగించారు. భోజనం అందుకున్న వారు, సేవ చేయించిన కుటుంబాన్ని, సంస్థలను మనస్ఫూర్తిగా దీవించారు. ఇది కేవలం ఓ వర్ధంతి కాదు%ొ% ఓ మంచి మార్గదర్శి ఆత్మకు అర్పించిన అశ్రునివాళి.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# సముచిత నిర్ణయాలు

## (విశ్లేషణ)

స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగి నవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు. అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ,సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంత ర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రా యాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మందిఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్య సభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశా బ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017-2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు. తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్థాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యా యన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయ మూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యో గులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14-15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షతంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు. నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి. ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సేవుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటంప్రశంసనీయమైన పరిణామం.

# పక్కా ఆధారాలతో బయటపడ్డ పాక్ బండారం..!
# ఉగ్రవాదిని మానవతా వాది అంటూ దొంగనాటకాలు!




పాకిస్తాన్ తన దేశంలో పెరుగుతున్న ఉగ్రవాదాన్ని దాచడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కానీ, ఎంత దాచాలని ప్రయత్నిస్తున్నా.. ప్రపంచానికి దాని నిజ స్వరూపం తెలుస్తూనే ఉంది. పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యం అమాయక మతాధికారిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ప్రధాన నాయకుడు, సహాయక చర్యల ముసుగులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాడు. అతని పేరు హాఫీజ్ అబ్దుల్ రవూఫ్. గత కొన్ని రోజులుగా వైరల్ అవుతున్న ఓ ఫొటోలో ఉన్న వ్యక్తి ఉగ్రవాది కాదని, మత నాయకుడు అని పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ వ్యక్తి కొంతమంది పాకిస్తాన్ సైనికులతో పాటు అంత్యక్రియల ఊరేగింపులో కనిపించాడు. ఆ వ్యక్తి తన ఐడి కార్డు కూడా చూపించి తాను ఒక సాధారణ రాజకీయ కార్యకర్తనని చెప్పాడు. అయితే పాకిస్తాన్ సైన్యం ఇచ్చిన ఆ వ్యక్తి సమాచారం.. అంటే పేరు, పుట్టిన తేదీ, జాతీయ గుర్తింపు సంఖ్య కూడా అమెరికాచే ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించబడిన వ్యక్తితో పూర్తిగా సరిపోలుతున్నట్లు తేలింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ లష్కరే తోయిబా, దాని ఫ్రంట్ సంస్థల కోసం విరాళాలు సేకరిస్తున్నాడు. పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి చూపించిన ఐడి కార్డులో అతను "వెల్ఫేర్ వింగ్ ఇన్‌చార్జ్, పీఎంఎంఎల్" అని ఉంది, అంటే అతను తన కార్యకలాపాలను దాచడానికి ఒక రాజకీయ లేదా మతపరమైన సంస్థ పేరును ఉపయోగిస్తున్నాడు. పాకిస్తాన్ సైన్యం మత ప్రచారకుడిగా అభివర్ణించిన వ్యక్తి నిజానికి ఒక అంతర్జాతీయ ఉగ్రవాది. దీన్ని బట్టి పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తోందని, ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోంది.


1999 నుండి లష్కర్ కోసం పనిచేస్తున్నాను..

యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ఉగ్రవాది హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఫేస్ ఆఫ్ ది లష్కరే తోయిబాగా ఉన్నాడు. లష్కరే తోయిబా అగ్ర నాయకత్వ బృందంలో చేరిన హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ 1999 నుండి ఆ సంస్థ కోసం పనిచేస్తున్నాడు. రవూఫ్ లష్కరే ఫ్రంట్ సంస్థ ఫలాహ్-ఎ-ఇన్సానియత్ ఫౌండేషన్ అధిపతి, ఇది సహాయ చర్యల ముసుగులో ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తుంది. 2008 ముంబై దాడుల తర్వాత లష్కరేపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగినప్పుడు, రవూఫ్ FIF పేరుతో పాకిస్తాన్‌లో నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాడు. 2009లో ఈ కార్యక్రమం నుండి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు సమాచారం. లష్కరే తోయిబా, జమాత్-ఉద్-దవా అధిపతి హాఫీజ్ మొహమ్మద్ సయీద్ సూచనల మేరకు రవూఫ్ నేరుగా పనిచేస్తాడు. 2008లో రవూఫ్ లష్కర్ మానవతా సహాయ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. 2003లో పబ్లిక్ సర్వీస్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆగస్టు 2008లో హాఫీజ్ సయీద్ ఆదేశం మేరకు,పాకిస్తాన్‌లోని బజౌర్ ప్రాంతంలో సహాయ, నిధుల సేకరణ కార్యకలాపాలను సమీక్షించడానికి రవూఫ్ ఒక బృందానికి నాయకత్వం వహించాడు. ఇది మాత్రమే కాదు, రవూఫ్ లష్కర్ ప్రతినిధిగా కూడా ఉన్నాడు. ఆయన సంస్థ తరపున మీడియాలో, వెబ్‌సైట్‌లలో, ప్రజా వేదికలలో మాట్లాడుతున్నాడు. FIF ద్వారా అతను లష్కర్ కు ప్రజల మద్దతు, నిధులను సేకరించడానికి హై-ప్రొఫైల్ మీడియా ఈవెంట్లను నిర్వహిస్తాడు. డిసెంబర్ 2008లో లష్కర్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఇంటర్వ్యూలో రవూఫ్ లష్కర్, జమాత్-ఉద్-దవా సంక్షేమ కార్యకలాపాల గురించి బహిరంగంగా మాట్లాడాడు, దానిని తన సంస్థ అని పేర్కొన్నాడు.

ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్‌కు నాయకత్వం వహించాడు

హాఫీజ్ రవూఫ్ లష్కర్ స్వచ్ఛంద విభాగం "ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్" అంటే IKKకి కూడా నాయకత్వం వహించాడు. 2007లో అతను పెషావర్‌కు వెళ్లి, వరద బాధితుల సహాయ చర్యలను పర్యవేక్షించాడు. మే 2004లో జమాత్-ఉద్-దవా సంక్షేమ అధిపతిగా అతను ఒక వైద్య సంస్థ వార్షిక నివేదికను కూడా సమర్పించాడు. IKK, JUD లను 2006 ఏప్రిల్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు సంస్థలుగా అమెరికా గుర్తించింది. హాఫీజ్ సయీద్‌ను మే 2008లో ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్ గా ప్రకటించారు. 2008 డిసెంబర్ లో జమాత్-ఉద్-దవాను UN 1267 ఆంక్షల జాబితాలో ఉంచారు. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ పై వచ్చిన ఆరోపణలు, ఉగ్రవాద సంస్థలు సేవ పేరుతో ఎలా భయాన్ని వ్యాప్తి చేస్తాయో మరోసారి నిరూపిస్తున్నాయి.

# ఆపరేషన్ సింధూర్‌లో ఇప్పటి వరకు
# ఎంత మంది భారత సైనికులు అమరులయ్యారంటే..?



పాకిస్తాన్‌కు ఇంతవరకూ చూపించింది ట్రైలరే.. మళ్లీ తోక జాడిస్తే అసలు సినిమా ముందుముందు చూపిస్తామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకే ఆపరేషన్ సింధూర్ చేపట్టామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. భారత సైన్యం. ఉగ్ర స్థావరాలను గుర్తించి అంతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. 9 ఉగ్ర శిబిరాలు ధ్వంసమవడంతో పాటు వందమంది ఉగ్రవాదులు అంతమయ్యారని ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్‌పై ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించిన త్రివిధ దళాల అధికారులు.. ఆపరేషన్‌పై కీలక వివరాలను వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 , పాకిస్థాన్‌లో 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు వివరించారు. భారత్ దాడులు చేస్తుందన్న భయంతో పాక్‌లోని ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయన్నారు. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించి దాడులు చేసినట్టు చెప్పింది భారత సైన్యం. అందుకు సంబంధించిన మ్యాప్‌లు, ఫోటోలను విడుదల చేసింది. భారత్ దాడులతో వణికిపోయిన పాకిస్తాన్.. మనదేశంలో పౌరులే లక్ష్యంగా దాడులకు పాల్పడింది. అయితే శత్రుదేశం అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. మే 8, 9వ తేదీల్లో భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. డ్రోన్లు, మానవరహిత విమానాలను భారత్‌పై ప్రయోగించింది. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పాక్ డ్రోన్ దాడులకు కౌంటర్‌గా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు చేసింది భారత్. మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నామని సైనిక అధికారులు తెలిపారు. ఇక మే 7 నుండి పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశానికి చెందిన 5 మంది సైనికులు అమరులయ్యారని భారత సాయుధ దళాలు తెలిపాయి. పాక్ పౌరులను లక్ష్యంగా చేసుకుని భారత్ ఎలాంటి దాడులు చేయలేదు. పాకిస్తాన్ మాత్రం భారత్ నగరాలే లక్ష్యంగా దాడులకు తెగబడింది. అయితే భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాకిస్తాన్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత సైన్యం. దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో ప్రత్యక్ష్యంగా తెలుసుకుంది. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించింది భారత్. ఆ దేశం మళ్లీ తోక జాడిస్తే సరైన సమాధానం చెప్పడానికి.. సైన్యం, వాయుసేనకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సిద్ధంగా ఉంది.

# పిఓకె, ఉగ్రవాదులను భారత్‌కు అప్పగిస్తేనే చర్చలు..
# ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు: ప్రధాని మోదీ



పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించే ఒప్పందంపై జరిగిన చర్చ సందర్భంగా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాట్లాడారు. పొరుగు దేశంతో చర్చించాల్సిన ఏకైక విషయం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) తిరిగి రావడం మాత్రమే అని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. అలాగే పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైనే మాత్రమే చర్చలు జరుగుతాయని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేశారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై సుదీర్ఘంగా చర్చించారు. కాల్పుల విరమణ దిశగా పాకిస్థాన్‌ను ఒప్పించేందుకు తాము సిద్ధమని జేడీ వాన్స్ మోదీకి వివరించారు. దీనికి మోదీ ప్రతిస్పందనగా.. మరోసారి నిబంధనలు ఉల్లంఘించి పాక్ కాల్పులు జరిపితే.. తాము మౌనంగా ఉండబోమని.. ధీటుగా బదులిస్తామని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. "కాశ్మీర్ విషయంలో మాకు చాలా స్పష్టమైన వైఖరి ఉంది, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మిగిలి ఉంది. ఇంకేమీ మాట్లాడటం లేదు. అలాగే ఉగ్రవాదులను అప్పగించడం గురించి వారు మాట్లాడితే, మనం మాట్లాడుకోవచ్చు. నాకు వేరే ఏ అంశం ఉద్దేశం లేదు" అని ప్రధాని మోదీ, జేడీ వాన్స్‌తో చెప్పినట్లు సమాచారం. ఈ అంశంపై భారతదేశం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

"మేము ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని కోరుకోవడం లేదు. మాకు ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదు" అని ఆయన చెప్పినట్లు సమాచారం. రెండు దాయాది దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ దాడులు జరిగిన అదే రాత్రి, భారతదేశం పాకిస్తాన్ అంతటా 26 స్థావరాలపై దాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించింది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, రెండు దేశాలు ఒకదానికొకటి సైనిక కదలికలను నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. అంతర్జాతీయ సమాజానికి, పాకిస్తాన్‌కు ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. భారతదేశం సరిహద్దు దాడులను సహించదని, అలాంటి ఏవైనా చర్యలను అధిక శక్తితో ఎదుర్కొంటామని ప్రదాని మోదీ వెల్లడించారు. ఈ పరిణామం, సరిహద్దు ఉగ్రవాదం, రెచ్చగొట్టే చర్యలను ఎదుర్కోవడంలో భారతదేశ విధానం మరింత చురుకైన, నిర్ణయాత్మక వ్యూహానికి మారిందని, దాని జాతీయ భద్రత విషయంలో రాజీకి అవకాశం లేదని సూచిస్తుంది. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. "మనం కొత్త సాధారణ స్థితిలో ఉన్నాం, ప్రపంచం దీనిని అంగీకరించాలి. పాకిస్తాన్ దీనిని అంగీకరించాలి, ఇది యథావిధిగా వ్యాపారం కాదు" అని మోదీ అన్నారు. పాకిస్తాన్ కాల్పులు జరిపితే, భారత్ మిస్సైల్స్‌తో దాడి చేస్తుందని భారత ప్రధానమంత్రి మోదీ గట్టి సందేశం ఇచ్చారు. మళ్లీ పాక్ కాల్పులకు తెగబడితే.. ధీటుగా స్పందించాలని భారత ఆర్మీని ప్రదాని మోదీ ఆదేశించారు. అటు నుంచి గోళీ మన దేశంలోకి వస్తే.. ఇటు నుంచి మిస్సైల్స్‌ను వదలండి అని ఆదేశించారు.

# అధికారులపై హోంమంత్రి అనిత సీరియస్..

## చర్యలు తప్పవని వార్నింగ్..




**అమరావతి,:** అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఆమె.. డీఆర్సీలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఏదో కాకి లెక్కలతో కాగితాల దొంతులుగా ప్రెస్‌నోట్ మా కిచ్చి వెళ్లిపోతున్నారని ఫైర్ అయ్యారు.. కానీ, ఆ పేపర్లు తర్వాత చెత్త బుట్టలోకి వెళ్లిపోతున్నాయి.. అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు.. కానీ, ఇక ఇలాంటి పద్ధతికి చెల్లు చీటు చెప్పండి ఇక నుంచి ముందే కలెక్టర్ వద్ద గత డీఆర్సీలో ఏం చేశామో చర్చించండి.. ఎంత వరకు పూర్తి చేశామో ముందే బ్రీఫ్ చేసి పెట్టుకోండి అని ఆదేశించారు.. విజయనగరం వెనుకబడిన జిల్లా అంటారు.. ఎవ్వరన్నారు వెనుకబడిన జిల్లా అని జిల్లాకి అన్ని వనరులు ఉన్నాయి.. వర్షపాతం అధికంగా ఉన్నాయి.. నీటి నిలువలు అధికంగా ఉన్నాయన్నారు హోంమంత్రి అనిత.. అధికారులు ఏం పని చేస్తున్నారో నాకు అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ డీఆర్సీలో ప్రజాప్రతినిధులు ఏ సమస్యలు లేవనెత్తినా.. ఆ తర్వాత అది ఎంత మేర పరిష్కరించగలిగామో చెప్పాలి.. లేనిపక్షంలో కచ్చితంగా చర్యలు తప్పవు అని వార్నింగ్ ఇచ్చారు.. ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.. గతంలో హెవీ లోడ్స్ తో వెళ్లిన వాహనాలు ఎన్ని ఉన్నాయో ఆర్ అండ్ బీ, ఆర్టీవో సమన్వయంతో గుర్తించాలని అడిగా కానీ, ఇంత వరకు ఎందుకు సమన్వయ సమావేశం పెట్టుకోలేదు? అని నిలదీశారు.. ఇలా అయితే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని ఆర్ అండ్ బీ అధికారులపై మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు..

# హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి దారుణంగా వ్యవహరిస్తున్నారు..



**హైదరాబాద్, :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా మండిపడ్డారు. హైడ్రాతో ముఖ్యమంత్రి దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 1965లో అల్వాల్ లో 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఓ కాలనీ ఉంది.. ఈ కాలనీకి ఇంటింటికీ నోటీసులు ఇవ్వడమే కాకుండా.. చివరికి గుడులకు కూడా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక తరం త్యాగం చేస్తే.. రెండో తరం ఇల్లు కట్టుకుంది.. మూడో తరం చదువుకుంటోంది అని గుర్తు చేశారు. బాలాజీ నగర్, అరుందతి నగర్ లో ఇలా ఉంది పరిస్థితి.. ఇక, ప్రజల జీవనంలో మంచి మార్పు వస్తదని ముఖ్యమంత్రిని చేస్తే.. నేను ఎవరు చెప్పినా వినను.. నాకు నేను నిర్ణయం తీసుకుంటానంటున్నాడు.. హైడ్రా పేరుతో పక్కా ఇల్లు కూలగొట్టుడే.. అడ్డమొచ్చిన వాళ్లను బుల్డోజర్లతో తొక్కవలసిందే అన్నట్లుగా రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ ఇస్తున్నాడని ఎంపీ ఈటల అన్నారు. అయితే, ఇంటెలిజన్స్ వ్యవస్థ అయినా ఇక్కడి ప్రజల పరిస్థితి చెప్తుంటరు కదా.. అయినా సీఎం రేవంత్ ఎందుకు వినడం లేదని బీజేపీ ఎంపీ ఈటల ప్రశ్నించారు. ఎవరు చెప్పినా వినని వారిని నాయకుడు అనరు.. సైకో అంటారని విమర్శించారు. ఇక, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బాధపడుతూ.. ఆత్మహత్య చేసుకుంటుంటే.. నవ్వే వాళ్లను సైకో అంటారు.. కోర్టుల్లో అడ్వకేట్లు వాదిస్తరు.. అంతిమ న్యాయనిర్ణేత జడ్జిది ఉంటది.. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ కర్తవ్యం ఆ పార్టీకి ఉంటది.. ఆయా పార్టీల ఎజెండా ఆయా పార్టీలకు ఉంటది.. కానీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు ప్రజలే ఉంటారు అని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

# రెండేళ్లలో పరిగి ప్రజలకు కొత్త హాస్పిటల్ అందుబాటులోకి



**హైదరాబాద్, :**వికారాబాద్ జిల్లా పరిగిలో హాస్పిటల్ భవనం నిర్మాణానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద బెడ్ల ఏరియా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ. 26 కోట్ల వ్యయం వెచ్చించి, రెండు సంవత్సరాల్లో కొత్త హాస్పిటల్‌ను ప్రజల సేవ కోసం అందుబాటులోకి తెచ్చే దిశగా వారు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. హాస్పిటల్‌లో అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రత్యేకంగా, కిడ్నీ పేషెంట్ల కోసం దయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్య పెంచే ప్రక్రియను ప్రారంభించామన్నారు. హాస్పిటల్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా, రోడ్డు ప్రమాదాలు , ఇతర ఎమర్జెన్సీల్లో ప్రజల ప్రాణాలు కాపాడే సదుపాయాలు అందజేస్తామని చెప్పారు. అంబులెన్స్ సేవలను మరింత మెరుగుపరచేందుకు, కొత్త అంబులెన్స్‌లు తీసుకురావడంపై దృష్టి పెట్టిన మంత్రి, ముఖ్యంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను పది నిమిషాలకు తగ్గించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవలే 213 కొత్త అంబులెన్స్‌ను గౌరవ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, భవిష్యత్తులో మరిన్ని అంబులెన్సు అందుబాటులోకి తీసుకొచ్చే వాగ్దానం చేశారు. పరిగిలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసే దిశగా పరిశీలన చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 16 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించడం, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యను అందించడం, యువతకు దేశం , విదేశాలలో ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రోత్సహించడం జరుగుతోందని చెప్పారు. 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసినట్లు, మరో 2300 పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా త్వరలో పూర్తి కానున్నట్లు వెల్లడించారు. హెల్త్ క్యాంపెయిన్లు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సీడీ (నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్) క్లినిక్స్ ఏర్పాటు చేయడం, అలాగే 4 రీజనల్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు పై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజలు తమ ఆహార అలవాట్లను సరిదిద్దుకుని, వ్యాయామం చేయడం ద్వారా వ్యాధుల నుండి రక్షించుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్ల రూపురేఖలను మార్చి, వాటిని ఆకర్షణీయంగా , పేషెంట్లకు సౌకర్యవంతమైన వాటిగా మారుస్తామని, ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించబడతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందరె రెడ్డి పాల్గొన్నారు.

# భారత రక్షణ శాఖకు విరాళం అందించిన ఇళయరాజా..

ఏప్రిల్ 22, 2025న కాశ్మీర్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత.. భారత్ పాక్ మధ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ గుండెల్లో గుబులు పుట్టిస్తుంది భారత్. ఇప్పటికే వందల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టింది భారత్. అయినప్పటికి భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో దేశం మొత్తం హై అలర్ట్ ప్రకటించింది. అయితే, తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఇరు దేశాల సరిహద్దుల్లో శాంతి నెలకొంది. అయితే ఈ విషయం పై ఇప్పటికే నటినటులు సెలబ్రెటీలు అంతా కూడా రియాక్ట్ అవుతూ భారత రక్షణ శాఖకు తోచినంత సహాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు, రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా భారత రక్షణ శాఖకు తన ఒకరోజు పారితోషికాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ విషయాన్ని ఇళయరాజా తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 'పహల్గామ్‌లో మన దేశ పర్యాటకులపై ఉగ్రమూక దాడి చేసింది. దీనికి మన దేశ సైనికులు తప్పక ప్రతీకారం తీర్చుకోవాలి. వారి ధైర్య సాహసాలు అభినందనీయం. మన సైనికులు ఆత్మస్థైర్యంతో వారిని మట్టు పెడతారనే నమ్మకం నాకు ఉంది. దేశ పౌరుడిగా, ఎంపీగా నా ఒకరోజు పారితోషికాన్ని దేశ రక్షణ శాఖకు విరాళంగా ప్రకటిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు.

# సుందర సౌరాష్ట్ర..సమైక్య యాత్ర



వడోదరలో పూల గడియారం... అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం. గాంధీనగర్‌లో అక్షరధామ్... పోర్‌బందర్‌లో కీర్తిమందిర్. ద్వారకలో కృష్ణుడి జగత్‌మందిర్...

కేలాడియాలో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ.

జామ్‌నగర్ లఖోటా కోట... సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం.

1 రోజు

సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. ఇది ఎనిమిది రోజుల టూర్. ఇందులో వడోదర, అహ్మదాబాద్, ద్వారక, సోమనాథ్, పోర్‌బందర్ కవర్ అవుతాయి.

2వ రోజు

ఉదయం పదకొండు గంటలకు రైలు వడోదర స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవాలి. మధ్యాహ్నం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహాన్ని చూడడానికి తీసుకెళ్తారు (ఎంట్రీ టికెట్ ప్యాకేజ్‌లో వర్తించదు, పర్యాటకులు కొనుక్కోవాలి). రాత్రికి వడోదర హోటల్ గదిలో బస. రాజ్యాలన్నింటికీ ఒకటే జెండా: స్టాచ్యూ ఆఫ్ యూనిటీ... స్వాతంత్ర్యసమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం. దీని ఎత్తు 597 అడుగులు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. గుజరాత్ రాష్ట్రం, కెవాడియా ప్రదేశంలో ఉంది. నర్మదానది మీద నిలబడి సర్దార్ సరోవర్ డ్యామ్‌ను చూస్తున్నట్లు ఉంటుంది. వడోదరకు వందకిలోమీటర్ల దూరం. దేశంలోని రాజ్యాల మధ్య ఐక్యత కోసం, జమీందారాలన్నింటినీ భారత్ రిపబ్లిక్‌లో విలీనం చేసి ఒక పతాకం కిందకు తీసుకురావడానికి పటేల్ చేసిన కృషిని గౌరవిస్తూ ఆయన విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ అనే పేరు పెట్టారు.

3వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత వడోదరలో హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. నగరంలో లక్ష్మీవిలాస్ ?ౄలెస్ తదితరాలను చూసిన తర్వాత అహ్మదాబాద్‌కు ప్రయాణం. అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం, అక్షరధామ్ టెంపుల్ చూసిన తర్వాత హోటల్ చెక్ ఇన్. రాత్రి బస. ప్యాలెస్‌లో స్టెప్‌వెల్: వడోదర... చారిత్రక ప్రాధాన్యత ఉన్న నగరం. ఈ నగరం విశ్వమిత్రి నది తీరాన ఉంది. నగరంలో మహరాజా షాయాజీరావు యూనివర్శిటీ... సిటీ హాల్... ఇలా ప్రముఖమైన కట్టడాలన్నీ రాజా పేరుతోనే ఉంటాయి. ప్యాలెస్‌ల ఆర్కిటెక్చర్ అద్భుతంగా ఉంటుంది. గైక్వాడ్ రాజకుటుంబం నివసించిన మహారాజా ప్యాలెస్‌లో సర్కార్‌వాడా, లక్ష్మీవిలాస్ ప్యాలెస్, ప్రతాప్ ప్యాలెస్, మోతీబాగ్ ప్యాలెస్, మోతీబాగ్ స్టేడియం, మహారాజా ఫతే సింగ్ మ్యూజియం, జూ, నవలాక్షి స్టెప్ వెల్ ఉన్నాయి. ఇది తొమ్మిది మిలియన్ల గ్యాలన్ల నీటిని స్టోర్ చేయగలిగిన బావి. ఇక లక్ష్మీ ప్యాలెస్ అయితే ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, గోడలకు మొజాయిక్ డెకరేషన్, టెర్రకోట శిల్పాలు... ఇలా ప్రతిదీ ఒక కళాఖండమే. ఫతే సింగ్ మ్యూజియం కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. ఇందులో గ్రీకు, రోమన్, యూరప్ శిల్పాలు, ఫ్రెంచ్ ఫర్నిచర్ ఉంది. రాజారవివర్మ చిత్రలేఖనాలు కూడా ఉన్నాయి. షాయాజీ రావు గైక్వాడ్ ఆధునిక వాది. నగరాన్ని శాస్త్రసాంకేతికంగా వృద్ధి చేశాడు. అంబేద్కర్ విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాడు.

4వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి ద్వారక వైపు సాగి?ోవాలి. దారిలో జామ్ నగర్‌లోని లఖోటా ప్యాలెస్, మ్యూజియం విజిట్. సాయంత్రానికి ద్వారక చేరి హోటల్ చెక్ ఇన్, రాత్రి బస. సరస్సులో కోట: కోటల చుట్టూ కందకాలుంటాయి. కానీ ఇక్కడ నీటి మధ్యలో దీవి మీద కోట ఉంటుంది. లఖోటా సరస్సు మధ్యలో ఉన్న కోట కావడంతో దీనిని లఖోటా కోట అనే పిలుస్తారు. జామ్‌నగర్ పాలకులు ఉపయోగించిన వస్తువులతోపాటు నాటి కళాకృతులతో కోటలోపల మ్యూజియం ఉంది.

ఐదవ రోజు

ఉదయం ద్వారకాధీశుని దర్శనం, బేట్ ద్వారక, నాగేశ్వర్ టెంపుల్ దర్శనం. ఆ తర్వాత ద్వారకకు తిరుగు ప్రయాణం. రాత్రి బస ద్వారకలోనే. బీసీ కాలపు జగత్‌మందిర్: కృష్ణుడు పూజలందుకునే ఈ ఆలయాన్ని ద్వారకాధీశ్ మందిర్ అంటారు. ఐదంతస్థుల ఆలయం మనకు విచిత్రంగా అనిపిస్తుంది. క్రీ.పూ రెండు వందల ఏళ్ల నాటిదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. మనకు ఇప్పుడు కనిపిస్తున్నది క్రీ.శ 15-16 శతాబ్దాల నాటి పునర్నిర్మాణం. ఆలయాలు పశ్చిమముఖంగా ఉండడం కూడా అరుదైన విషయం. ఆలయంఅరేబియా సముద్రాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. తెలుగు రాష్ట్రం చిత్తూరు జిల్లా, నాగులాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో విష్ణుమూర్తి పశ్చిమముఖంగా ఉంటాడు.

6వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి సోమనాథ్ వైపు సాగిపోవాలి. దారిలో పోర్‌బందర్‌లోని కీర్తిమందిర్, సుధామ టెంపుల్ విజిట్. సోమనాథ్ చేరిన తర్వాత సోమనాథ జ్యోతిర్లింగ దర్శనంతోపాటు ఆలయం చుట్టు పక్కల ఉన్నవాటిని తిరిగి చూడడం, సాయంత్రం తర్వాత పోర్‌బందర్‌కు ప్రయాణం. రాత్రికి పోర్ బందర్ రైల్వే స్టేషన్‌కి చేరడంతో యాత్ర పూర్తవుతుంది.

145 ఏళ్లుగా ఆగని గడియారం:

ఫ్లోరల్ క్లాక్... వడోదర సిటీసెంటర్‌లోని షాయాజీ బాగ్‌లో ఉంది. క్రీ.శ 1879లో మూడవ మహరాజా షాయాజీరావు నిర్మించాడు. 13 ఎకరాల ఉద్యానవనంలో బరోడా మ్యూజియం అండ్ పిక్చర్ గ్యాలరీ, ఒక జూ, సర్దార్‌పటేల్ ప్లానిటోరియం... గార్డెన్ మొత్తం చూడడానికి టాయ్‌ట్రెన్ ఉన్నాయి. ప్లానిటోరియం పక్కనే ఆస్ట్రానమీ పార్క్ ఉంది. పురాతన కాలంలో వాడిన ఆస్ట్రనామికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా ఉన్నాయి. బరోడా మ్యూజియంలో పిక్చర్ గ్యాలరీలో మినియేచర్ కళాఖండాల నిలయం. హజీరా మఖ్బారా, న్యాయమందిర్, దభోయి ఫోర్ట్, మకాయ్ కోట, జమామసీదు, కీర్తి మందిర్, అరబిందో సొసైటీ చూడవచ్చు. స్థానికులు గుజరాతీతోపాటు సింధీ భాష కూడా మాట్లాడతారు. అహ్మదాబాద్: అహ్మదాబాద్ గురించి మాట్లాడాలంటే సబర్మతి నది గురించి మాట్లాడాలి. నదికి రెండువైపులా విస్తరించిన నగరం ఇది. ఒక వైపు వాళ్లు మరో వైపుకు రావడానికి నగరంలో ఈ నది మీద పదకొండు వంతెనలున్నాయి. ఎల్లిస్, గాంధీ, నెహ్రూ, సుభాష్, వాదాజ్ దూధేశ్వర్, సర్దార్, చంద్రభాగా, అంబేద్కర్, లాల్ బహదూర్ శాస్త్రి, ఫెర్నాండెజ్, దండి బ్రిడ్జిలు. బ్రిటిష్ పాలకుల తోపాటు జాతీయనాయకులను గౌరవిస్తూ నామకరణం చేయడం గొప్పగా అనిపిస్తుంది. మీరు నగరంలో ఏ వంతెన మీద ప్రయాణించారో సరదాగా గమనించండి. సబర్మతి రివర్ ఫ్రంట్ సూర్యోదయాలు, సాయంత్రాలను ఆస్వాదించడానికి మంచి ప్రదేశం. ఇక మనకు చిన్నప్పటి నుంచి చిరపరిచితమైన సబర్మతి ఆశ్రమం గాంధీజీ నివసించిన ప్రదేశం. ఇక్కడ జాతీయోద్యమ చర్చలు జరిగేవి. గాంధీజీ దండి సత్యాగ్రహాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఇప్పుడు ఆశ్రమంలో గాంధీజీ ఉపయోగించిన వస్తువులను చూడవచ్చు. నగరంలో సయ్యద్ సిద్ధిఖీ జాలీలో రాతిలో సునిశితంగా చెక్కిన డిజైన్‌ని తప్పకుండా చూడాలి. జైన్ మందిరం, కాలికో మ్యూజియం, సర్దార్ పటేల్ మ్యూజియం కూడా చూడాల్సిన ప్రదేశాలు.

ప్రశాంత ధామం: అక్షరధామ్ టెంపుల్ గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉంది. అహ్మదాబాద్‌కు 40 కిమీల దూరం. నగరంలో రాజధాని హడావుడి, ట్రాఫిక్ జామ్‌లు ఉండవు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ప్రభుత్వ ఆఫీసులు, వాటి అనుబంధ భవనాలు తప్ప ఇతర వర్తక వాణిజ్యాలు ఉండవు. నగరం ప్రశాంతంగా ఉంటుంది.

గాంధీజీ ఇక్కడే పుట్టాడు:

పోర్‌బందర్.... గాంధీజీ పుట్టిన నేల. ఇక్కడ గాంధీజీ పుట్టిన ఇల్లు బాపూ మహల్ ఉంది. దాని పక్కనే స్మారక మందిరం కీర్తిమందిర్, బాపూ మహల్ వెనుకగా కస్తూర్బా గాంధీ ఇల్లు ఉన్నాయి. గాంధీజీ ఇంటిలో అటకల నిర్మాణాన్ని గమనించాలి. పోర్‌బందర్‌లో శ్రీకృష్ణుని స్నేహితుడు సుధాముడికి మందిరం, వాళ్ల గురువు సాందీపుడి మందిరం ఉన్నాయి. సుధాముడి మందిరం విశాలంగా ఉంటుంది. ఇక్కడ భక్తులకు ప్రసాదంగా అటుకుల ?ౄకెట్ ఇస్తారు. ఈ ఐటెనరీ ప్రకారం సోమనాథ్ నుంచి తిరుగు ప్రయాణంలో పోర్‌బందర్‌కు చేరే ప్రయాణం అరేబియా తీరం వెంబడే సాగుతుంది. కాబట్టి జర్నీలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదించవచ్చు. సోమనాథ జ్యోతిర్లింగం: సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం ఓ గొప్ప ఆధ్యాత్మిక అనుబూతి. సోమనాథుడిని దర్శనం తర్వాత ఆలయం ఆవరణలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను చూడవచ్చు. ఆలయం బేస్ మెంట్ ఎత్తుగా ఉంటుంది. ఆలయం వెనుక సముద్రపు అలలు ఆలయాన్ని అలవోకగా తాకుతూ ఉంటాయి. ఆయలం ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం నమూనాలోనే ఉంటుంది. నర్మద తీరాన పెద్ద విగ్రహస్థాపనకు ముందు నుంచే సోమనాథ్ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహం ఉంది.

7వ రోజు

00.50 నిమిషాలకు (అర్ధరాత్రి 12.50 నిమిషాలు) ట్రైన్ నంబరు 20968 పోర్ బందర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ?ోర్‌బందర్ స్టేషన్ నుంచి బయలుదేరుతుంది.

8వ రోజు...

ట్రైన్ ఉదయం 8.20 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుతుంది. బుధవారం మొదలైన పర్యటన బుధవారంతో పూర్తవుతుంది. ఈ ట్రైన్ అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఇదే రైలు తిరిగి సికింద్రాబాద్ నుంచి పోర్‌బందర్‌కు బయలుదేరుతుంది. ఇది వీక్లీ ట్రైన్.

ప్యాకేజ్ ధరల వివరాలు..

సుందర సౌరాష్ట్ర (ఎస్‌హెచ్‌ఆర్066) టూర్‌లో భాగంగా... ట్రైన్ నంబర్ 20967 సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. కంఫర్ట్ కేటగిరీ అంటే థర్డ్ ఏసీలో ప్రయాణం. ఇందులో ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 30 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 29 వేలవుతాయి. స్టాండర్డ్ కేటగిరీలో ట్విన్ షేరింగ్‌కి దాదాపు 27 వేలు, ట్రిపుల్ షేరింగ్‌కి దాదాపు 26 వేలవుతుంది. ఇందులో సింగిల్ ఆక్యుపెన్సీకి అవకాశం లేదు. ?ౄకేజ్‌లో నాలుగు బ్రేక్‌ఫాస్ట్‌లు, నాలుగు రాత్రి భోజనాలు ఇస్తారు.

# మహాద్భుతం.. బుద్ధవనం



నల్లగొండ: రెండు వేల సంవత్సరాల క్రితం ఆచార్య నాగార్జునుడు స్థాపించిన విజయపురి విశ్వవిద్యాలయం, ఇక్కడ విలసిల్లిన బౌద్ధమత ప్రాచుర్యం ఆధారంగా కృష్ణా తీరంలో (నాగార్జునసాగర్ తీరంలో) బుద్ధిస్టు హెరిటేజ్ థీం పార్కును బుద్ధవనం ప్రాజెక్టుగా మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అభినవ బుద్ధుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల ఇది. ఆ చరిత్ర ఆధారంగానే సాగర్ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం (శ్రీపర్వతారామం), 30 ఎకరాల్లో విపశ్యన కేంద్రం నిర్మించారు. అష్టాంగ విభాగాలుగా దీని నిర్మాణం చేశారు. ఆసియా ఖండంలోనే సిమెంట్‌తో నిర్మించిన అతిపెద్ద మహాస్థూపం బుద్ధవనం. ఈ నెల 12వ తేదీన బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలు దేరి వెల్లంకిలో కొంతసేపు సేద దీరి, నాగార్జునసాగర్‌కు చేరుకుంటారు. విజయవిహార్ అతిథిగృహంలో వారికి స్వాగత ఏర్పాట్లు చేశారు. విజయవిహార్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో సెషన్‌లో పాల్గొంటారు. అనంతరం విజయవిహార్ వెనుకభాగంలో, సాగర్ తీరాన పచ్చికబయళ్లలో వారు ప్రత్యేకంగా ఫొటోలు దిగుతారు. ఆ తరువాత బుద్ధవనం చేరుకుంటారు. బుద్ధుని పాదుకల వద్ద 25 మంది బౌద్ధ సన్యాసులు నిర్వహించే బౌలికుప్ప మహాబోధి పూజల్లో పాల్గొంటారు. అక్కడినుంచి మహాస్థూపం వద్దకు చేరుకొని, వెనుక భాగాన ఉన్న మెట్ల ద్వారా పైకి ఎక్కుతారు. దానికి వంద అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాన్ని తిలకిస్తారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్దకు చేరుకొని అక్కడ కొవ్వొత్తులు వెలిగించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా బౌద్ధమత గురువు నిర్వహించే 5 నిమిషాల ప్రార్థనలో పాల్గొంటారు. అనంతరం రెండు నిమిషాల పాటు ్ధ్యానం చేస్తారు. అక్కడి నుంచి మహాస్థూపం చుట్టూ ఉన్న 2,500 విగ్రహాల గురించి పర్యాటక శాఖ ప్రతినిధి శివనాగిరెడ్డి వివరిస్తారు. అనంతరం జాతకవనంలోకి వెళతారు. అక్కడ వారికి బుద్ధవనం, తెలంగాణలో బౌద్ధ చరిత్ర ప్రాధాన్యత గురించి పర్యాటక శాఖ ప్రతినిధి వివరిస్తారు. బుద్ధుని పుట్టుక నుంచి నిర్యాణం వరకు ప్రత్యేక డ్రామాను ప్రదర్శిస్తారు.

## బుద్ధుని జీవిత విశేషాలు

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2003లో దీనిని ప్రారంభించింది. సిద్ధార్థ గౌతముని జీవితంలోని ప్రధాన ఘట్టాలను వర్ణించే అనేక నేపథ్య విభాగాలతో కూడినదే బుద్ధవనం. ఆయన పూర్వ జన్మ కథలను చిత్రీకరించిన జాతక పార్క్, సూక్ష్మ స్థూపాలతో కూడిన స్థూపపార్క్, మహాస్థూపం, బౌద్ధ హెరిటేజ్ మ్యూజియం, మహాస్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం, 27 అడుగుల బుద్ధ విగ్రహం ఇందులో ఏర్పాటు చేశారు. ధమ్మ గంటను శ్రీలంక ప్రభుత్వం విరాళంగా ఇచ్చింది. దేశంలోనే ఇది మొదటిది.

## ప్రవేశ వేదిక

ప్రవేశ వేదిక అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు, ఐకానిక్ రూపంలో బుద్ధుడు, జంతువులు, పక్షులు, బోధి వృక్షం, మిథునాలు (రసిక జంటలు), బుద్ధపాదాలు వంటివి ఇక్కడ ఉంటాయి. ప్రధాన ఇతివత్తాలు, సిద్ధార్థుని కిరీటం (జుట్టు) మోస్తున్న అగ్ని స్తంభం, నాగముచిలింద, పవిత్ర అవశేషాల ఆరాధన, మధ్యలో అశోక ధర్మ చక్రం స్తంభంతో శక్తివంతమైన విల్లును మోస్తున్న సిద్ధార్థుడు వంటి శిల్పాలు ఉంటాయి.

## బుద్ధ చరిత్రవనం

సిద్ధార్థ గౌతమ జీవితంలో ఐదు ప్రధాన సంఘటనలు ఉన్నాయి. అవి జననం, నాలుగు సమావేశాలు, మహా నిష్క్రమణ, జ్ఞానోదయం. బుద్ధుని మొదటి ఉపన్యాసం, మహాపరినిర్వాణం వంటి అంశాలపై చిత్రాలను కాంస్యంతో చేశారు. పల్నాడు సున్నపు రాయిలో చెక్కబడిన బుద్ధపాద స్లాబ్ అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు ఉద్యానవన ప్రవేశ ద్వారం వద్ద ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయి.

## జాతక వనం (బోధిసత్వ పార్క్)

బోధిసత్వుడు బుద్ధుడిగా మారటానికి ముందు పది పరిపూర్ణతలను ఆచరిస్తూ జీవితాన్ని గడుపుతాడు. వాటినే దశపారమిత అంటారు. అవి దాన (ఉదారత), శీల (ధర్మం), శాంతి (సహనం), వీర్య (ధైర్యం), ధ్యాన (ఏకాగ్రత), ప్రజ్ఞ (జ్ఞానం), త్యాగ (త్యజించడం), సత్య (సత్యం), కరుణ (ప్రేమపూర్వక దయ), సమత (సమానత్వం). 547 జాతక కథలలో 40 జాతక కథలు అమరావతి, ఫణిగిరి, నాగర్జునకొండ, గోలి, జగ్గయ్యపేట, చందవరం బౌద్ధ క్షేత్రాలలోని అసలు శిల్పకళా ఫలకాల ఆధారంగా పల్నాడు లైమ్ స్టోన్‌లో చిత్రీకరించారు.

## ధ్యానవనం (మెడిటేషన్ పార్క్)

27 అడుగుల అవుకాన బుద్ధను ధ్యానవనంలో ఏర్పా టు చేశారు. దీనిని శ్రీలంక ప్రభుత్వం అందజేసింది.

## స్తూపవనం (మినియేచర్ స్తూప పార్క్)

కర్లా, అజంతా (మహారాష్ట్ర), సాంచి (మధ్యప్రదేశ్), సారనాథ్ (ఉత్తరప్రదేశ్), మంకియాలా, (పంజాబ్- పాకిస్తాన్), అనురాధపుర, శ్రీలంక, కహు-జో-దారో, మిర్పూర్ ఖాస్, పాకిస్తాన్, బౌధానాత్, మహాస్త్రాస్తాన్, నేపాల్‌లోని స్థూపాల ప్రతిరూపాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. థాయ్‌లాండ్, పార్డో కాలింగ్ చోర్టెన్ టిబెట్, శ్వేసాండావ్-మయన్మార్, గ్యాంగ్జు, దక్షిణ కొరియా, భారతదేశం, ఆగ్నేయాసియాలోని బౌద్ధ స్థూప నిర్మాణాల రూపాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

## మహాస్తూపం

బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణ మహాస్తూపం. అమరావతిలోని అసలు స్థూపం కొలతలు, వాస్తుశిల్పం ప్రకారం దీనిని నిర్మించారు. దాని పైభాగంలో వేదిక (డ్రమ్), గోపురం (అండ), హార్మిక ఉన్నాయి. 42 మీటర్ల వెడల్పు, 21 మీటర్ల ఎత్తుతో దాని డ్రమ్, గోపురం భాగాలపై బౌద్ధ ఇతివృత్తాల శిల్ప ఫలకాలతో ఏర్పాటు చేశారు. మహాస్తూపం చుట్టూ గోడపై బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన రాజులు, ధర్మ పోషకుల దశ్యాలు ఉంటాయి. గోపుర భాగంపై వజ్రాసన, బోధి వక్షం, అగ్ని స్తంభం, జాతక కథలు, బుద్ధుని జీవితంలోని సంఘటనలు వంటి బౌద్ధ చిహ్నాలను వర్ణించే శిల్పాలు చెక్కారు. స్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం ఉంటుంది.

## మహాస్థూపం లోపల వర్చువల్ ఆకాశ దృశ్యం

మహాస్థూపం లోపల 25 అడుగుల ఎత్తులో పంచధ్యాన బుద్ధులను ఏర్పాటు చేశారు. మహాస్తూపం పైకప్పు ఆకాశాన్ని తలపిస్తూ తామరపువ్వు రేకుల ఆకారంలో ఉంటుంది. పైకప్పు లోపలి భాగం చిల్లులు గల ట్రాపెజోయిడల్ ప్యానెల్‌లతో ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి ఒక్కటి మరొకదానికి భిన్నంగా 2.5 మీటర్ల పరిమాణంలో, కాంతి థర్మోడైనమిక్స్, ప్రత్యేక ప్రకాశాన్ని జోడించేలా ఉంటాయి. ఇందులో లోటస్ రేకులు (960), స్కై ప్యానెల్‌లు (528) ఉంటాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ఉపయోగించిన జర్మన్ టెక్నాలజీతో వీటిని ఏర్పాటు చేశారు.

## బుద్ధవనానికి అవార్డులు

విశిష్ట ఆకర్షణలతో కూడిన ఈ ప్రాజెక్టుకు అనేక అవార్డులు లభించాయి. పర్యాటకులకు ఉత్తమ పౌర సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను అందించినందుకు తెలంగాణ పర్యాటక శాఖ 2022లో అవార్డును అందజేసింది. దీనిపై నిర్మించిన డాక్యుమెంటరీకి ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం అవార్డును అందుకుంది. 2022లో కోల్‌కతాలో బౌద్ధ టూర్ ఆపరేటర్ల సంఘం 'భూటాన్ బంగ్లాదేశ్ ఇండియా అండ్ నేపాల్ టూరిజం మిత్ర అవార్డు'ను కూడా అందుకుంది.

## బౌద్ధ వారసత్వ ప్రాంగణం బుద్ధవనం

తెలంగాణలో బౌద్ధమతం ఆగమనం బుద్ధుని జీవితకాలం నాటిది. సుత్తనిపాత పారాయణవగ్గ ప్రకారం 'కవిట్టవనమిష్టి గోదావరి రివేరిన్'అనే బ్రాహ్మణ ఋషి బుద్ధుని బోధనలను వినడానికి తన 16 మంది శిష్యులను మగధకు పంపాడు. బుద్ధుని అనుచరులుగా మారిన పింగియా.. బుద్ధుని బోధనలను తీసుకువచ్చారు. అప్పటినుంచి నుంచి తెలంగాణలో థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ శాఖలు విస్తరించాయి. అస్సీఘాట్, కోటిలింగాల, కంబాలపల్లి, పాశిగావ్, ధూళికట్ట, ఫణిగిరి, తిరుమలగిరి, వర్ధమానుకోట, గాజులబండ, నేలకొండపల్లి, శ్రీపర్వతం ప్రాంతాల్లో (నాగార్జునసాగర్ ప్రాంతం) బౌద్ధమతం మూడు దశల్లో పరిఢవిల్లింది.

## భారీ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



ముంబయి : సోమవారం ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగింపు సమయానికి భారీ లాభాల బాటనే ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,950.34 పాయింట్లు లేదా 3.71 శాతం లాభంతో 82,404.81 వద్ద, నిఫ్టీ 912.80 పాయింట్లు లేదా 3.80 శాతం లాభంతో 24,920.80 వద్ద నిలిచాయి. చాల రోజుల తరువాత భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ నేడు ముగిసింది. ఈ విషయం తెలిసిన విదేశీ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈ రోజు 3,500 కోట్ల రూపాయల నికర కొనుగోళ్లను నమోదు చేశారు. ఇదే సమయంలో డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా 2,800 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొన్నారు. ఇది మార్కెట్‌లో బలమైన డిమాండ్‌ను సూచిస్తుంది. కొన్ని కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలతో మార్కెట్‌ను ఆకర్షించాయి. బజాజ్ ఎలక్ట్రికల్స్ తమ నికర లాభం 59.05 కోట్ల రూపాయలకు చేరడంతో 14.78 శాతం పెరిగింది. ఈ క్రమంలో రాబోయే త్రైమాసిక ఫలితాలు, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల నిర్ణయాలు మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

## యుద్ధం అంటే రొమాంటిక్.. బాలీవుడ్ సినిమా కాదు

### భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె



పుణె : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కాల్పుల విరమణ ఒప్పందంపై కొందరు ప్రశ్నలు లేవనెత్తుతున్న సమయంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధమంటే రొమాంటిక్ వ్యవహారం కాదని, అదొక బాలీవుడ్ సినిమా అసలే కాదని స్పష్టం చేశారు. ఘర్షణ వాతావరణానికి స్వస్తి పలికి, దౌత్య మార్గాల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుణెలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ నరవణె ప్రసంగిస్తూ. "యుద్ధం లేదా హింస అనేవి మనం ఆశ్రయించాల్సిన చివరి మార్గాలు కావాలి. అవివేకులైన కొందరు మనపై యుద్ధాన్ని రుద్దినా, మనం దానిని ప్రోత్సహించకూడదు" అని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారని చెబుతూ "ఒక సైనికుడిగా, ఆదేశాలు వస్తే నేను యుద్ధానికి వెళతాను. కానీ, అది నా మొదటి ఎంపిక కాదు" అని జనరల్ నరవణె తేల్చి చెప్పారు. దౌత్యానికి, చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవడానికే తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, సాయుధ పోరాటం వరకు పరిస్థితి రాకుండా చూడాలని కోరుకుంటానని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, ముఖ్యంగా పిల్లలు పడే ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. "షెల్లింగ్ జరిగినప్పుడు, రాత్రిపూట సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయాల్సి రావడం వంటి భయానక దృశ్యాలు చిన్నారుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధ తరతరాలు వెంటాడుతుంది. పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బారిన పడిన వారు, భయంకరమైన ఘటనలు చూసిన ఇరవై ఏళ్ల తర్వాత కూడా చెమటలతో నిద్రలేచి, మానసిక చికిత్స అవసరమయ్యే పరిస్థితులు ఉంటాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశాల మధ్యే కాకుండా, కుటుంబాలు, రాష్ట్రాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య కూడా విభేదాలను హింస ద్వారా కాకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "జాతీయ భద్రతలో మనమందరం సమాన భాగస్వాములం. హింస దేనికీ సమాధానం కాదు" అని నరవణె ఉద్ఘాటించారు.

## సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్



తెలంగాణ : సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సఅష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. రాష్ట్రంలో అభివఅద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## త్రివిధ దళాధిపతులతో ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి మోడి నివాసంలో త్రివిధ దళాధిపతులతో నేడు ప్రధాని ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. భారత్, పాక్‌ల పరస్పర చర్చల తర్వాత కాల్పుల విరమణ ప్రకటించడం, ఆ తర్వాత దానిని ఇస్లామాబాద్ ఉల్లంఘించడం వంటి విషయాలపై సోమవారం భారత్-పాక్ మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు సైనిక దళాధిపతులు పాల్గొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే పాక్ మళ్లీ దాడులకు తెగబడటం, అనంతర పరిణామాలపై త్రివిధ దళాలతో ప్రధాని మోడి ఎప్పటికప్పుడు సమీక్షలు చేపడుతున్నారు. తాజా పరిస్థితులపై మరికొద్దిసేపట్లో విదేశాంగ శాఖ, రక్షణశాఖ ప్రెస్ బ్రీఫింగ్ చేయనుంది.

# మీడియా చేసిన యుద్ధం




కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు దాడిచేసి 26 మందిని పొట్టన పెట్టుకున్న సంఘటనలో పొరుగు దేశానికి మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవడానికి రెండు వారాలు పట్టింది. నిజమే, ఇటువంటి ప్రధానమైన నిర్ణయం, దాదాపుగా పొరుగుదేశం మీద యుద్ధం చేస్తున్నంత పెద్ద నిర్ణయం తీసుకోవడానికి కేంద్రానికి అంత సమయం పట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు ఆ విషాదం నుంచి దేశం తేరుకోవడానికే వారం రోజులు పట్టి ఉంటుంది. ఇప్పటికీ ఇంకా ఈ దేశప్రజల కళ్ళల్లో ఆ దృశ్యాలు మెదులుతూనే ఉంటాయి. అయితే కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడానికి సమయం తీసుకున్నదే తప్ప మన భారతదేశ మీడియాకు మాత్రం అంత ఓపిక లేదు. సంఘటన జరిగిన మరునాటి నుండే మన మీడియా.. ముఖ్యంగా 24 గంటల వార్తా ప్రసారాలు చేసే న్యూస్ ఛానళ్లు పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించేసాయి. 'ఇంకా ఆలస్యం దేనికి? యుద్ధం మొదలు పెట్టండి' అని చెప్పి కేంద్ర ప్రభుత్వాన్ని గదమాయిస్తున్న, సలహాలిస్తున్న ప్రసారాలు అనేకం మనకి ఈ పక్షం రోజుల్లో కనిపించాయి, వినిపించాయి.' ఎటువంటి నియంత్రణలకు అవకాశం లేని మాధ్యమాల పేరిట చలామణి అవుతున్న సామాజిక వేదికల బాధ్యతరాహిత్యం గురించి కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వచ్చి పెద్దయెత్తున చర్చ జరుగుతున్న సమయంలో, ఎంతో కొంత నియంత్రణకు లోబడి పని చేస్తాయి అనుకుంటున్న, ప్రధాన స్రవంతి మీడియాగా చెప్పుకుంటున్న 24 గంటల వార్తా ప్రసారాలు సాగించే ఛానళ్ల నిర్వాకం ఈ పక్షం రోజుల్లో చూసినవాళ్ళు, ఆ హింసను అనుభవించిన వాళ్ళు వీటిని నియంత్రించడం ఎలా అనే ఆలోచనలో పడ్డారు. వార్తాపత్రికలు తమ సర్క్యులేషన్లను, వార్తాప్రసార మాధ్యమాలు తమ టీఆర్పీలను (వీక్షకుల సంఖ్య) పెంచుకోవడానికి సంచలనాలకోసం పాకులాడటం కొత్త విషయం ఏమీ కాకపోయినా ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాటి ఈ వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు గురవుతున్నది. కొంతలో కొంత ప్రింట్ మీడియా సంయమనం పాటిస్తున్నప్పటికీ, 24 గంటల న్యూస్ ఛానళ్ళు మాత్రం రెచ్చిపోయి తమకు తోచిన విధంగా అసత్యాలు, అర్ధసత్యాలు, అభూతకల్పనలను దేశ ప్రజల చెవులు చిల్లులు పడేట్టు అరిచి చెప్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' జరుగుతున్న క్రమంలో ఒక మీడియా హౌస్ సంపాదకవర్గ సమావేశంలో అధికారికంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బ్రీఫింగుకు సంబంధించిన వార్తలు మాత్రమే ప్రచురించాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు.. అలా అయితే పేజీలు నింపడం ఎలా? అన్న సందేహాలు వ్యక్తం అయ్యాయట. 24 గంటలలో ఒకసారి మాత్రమే ఉదయంపూట పాఠకుల చేతికి అందే దినపత్రికల పరిస్థితే ఇలా ఉంటే ప్రసార మాధ్యమాలు 24 గంటలు ఏం చూపించాలి, ఏం మాట్లాడాలి? అందుకే ఒకరు ఇస్లామాబాద్ పని అయిపోయిందంటే, మరొకరు లాహోర్ మట్టి కొట్టుకుపోయిందని, ఇంకొకరు కరాచీ కనిపించకుండాపోయిందని మసాలాలు దట్టించి వార్తలు ప్రసారం చేయడం మనం 'ఆపరేషన్ సిందూర్' మొదలయినప్పటినుండి చూస్తున్నాం. పాకిస్తాన్ పని అయిపోయిందని ఒక ప్రముఖ పాత్రికేయుడు వ్యాఖ్యానిస్తే, ఆ దేశ ప్రధానమంత్రి ఇల్లు వదిలి పారిపోయాడని మరొక వార్త ఛానల్ చెబుతుంది. లేదు, ఆ దేశంలోని ప్రముఖులంతా బహరిన్‌కు తట్టాబుట్టా సర్దుకుని వెళ్ళిపోయారని ఇంకొక ఛానల్ చెప్తుంది. అసలు జరుగుతున్నది ఏమిటి? ఈ దేశ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత.. అందులోనూ వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తన మీద ఉందన్న విషయం మీడియా మరిచిపోయింది. దానికి కారణం.. అసలు ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోవడం, తెలుసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం. సీనియర్ పాత్రికేయురాలు కల్పనాశర్మ ఒకచోట రాసినట్టు భారతదేశాన్ని తీవ్రమైన టెర్రరిజం అనే మబ్బులు కమ్మేసి ఏం జరుగుతుందో కనిపించని, ఏ శబ్దాలు వినిపించని వేళ మన మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాల్ని వండి వార్చేస్తున్నది. నిజానికి ఏం జరుగుతున్నది? పహల్గాం మారణకాండ అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌లోని తొమ్మిది టెర్రరిస్ట్ కేంద్రాలను టార్గెట్‌గా చేసుకొని చేసిన దాడి, ఆ దాడిలో 100 మంది వరకు మృతి చెందిన విషయం, దానికి జవాబుగా భారత భూభాగంపైకి పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లను మట్టికరిపించే పనిలో భారత సైనిక బలగాలు పనిచేస్తున్నాయి. దీనికి సంబంధించి గత మూడు రోజులుగా సైన్యానికి సంబంధించిన ఉన్నతాధికారులు అధికారికంగా పత్రికా సమావేశాలు నిర్వహించి వివరాలు వెల్లడిస్తూనే ఉన్నారు. అది మాత్రమే రాసి ఊరుకుంటే 24 గంటలు న్యూస్ ఛానల్ నడపడం ఎలా? వీక్షకుణ్ని మరో ఛానల్ వైపు వెళ్లకుండా ఆపడం ఎలా? ఇదీ ఇవాళ మెజారిటీ న్యూస్ ఛానల్ పరిస్థితి దేశంలో. ప్రభుత్వం వెల్లడించిన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలిపి ఊరుకుంటే అది మీడియా బాధ్యతా ఎలా అవుతుందని ఆ మాధ్యమాల వాళ్లు ప్రశ్నించవచ్చు. నిజమే.. మామూలు పరిస్థితుల్లో అయితే ప్రభుత్వం అందించే సమాచారంలో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకుని అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజెయ్యాల్సిన బాధ్యత మీడియాది. ఆ పని మీడియా చేస్తున్నట్టు కనిపించదు. ఇటువంటి యుద్ధ వాతావరణం ఉన్న సమయలో ఆ అవకాశాలు కూడా తక్కువే ఉంటాయి. అందుకని మనం చేస్తున్నదేమిటి.. చర్చల పేరిట గాలి పోగు చేసి వీక్షకుల మీదకు వదులుతున్నాం. ఇందులో కొన్ని మినహాయింపులు లేవని చెప్పలేం, అయితే అవి చాలా స్వల్పం. కేంద్రప్రభుత్వం కూడా ఈ మెజారిటీ న్యూస్ ఛానళ్ళు రోజుల తరబడి ప్రసారం చేసే అసత్యాలు, అర్ధసత్యాలు, అభూతకల్పనల జోలికి వెళ్లడం లేదు. నిపుణుల పేరుతో గంటల తరబడి తెలిసీ తెలియని విషయాలు చర్చించేవాళ్ళని కూడా ఎవరూ తప్పు పట్టడం కానీ, సరి చెయ్యడం కానీ జరగడం లేదు. చరిత్ర తీవ్ర వక్రీకరణలకు గురికావడానికి రేపు ఈ మాధ్యమాలవారు బాధ్యులు కాక తప్పదు. విశ్వసనీయత చెడకుండా వీలైనంతవరకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వాస్తవాలను మాత్రమే ప్రజలకు అందించాలనే ఆలోచన కలిగిన, ఆ మార్గాన్నే నడుస్తున్న కొన్ని ఛానళ్లు లేదా కొన్ని డిజిటల్ వేదికలు సహజంగానే వెనుకబడిపోతున్నాయి. ఇలా యుద్ధోన్మాదంతో ఊగిపోతున్న ఛానళ్ళను వదిలేసి విచిత్రంగా 'ది వైర్' వంటి డిజిటల్ ఛానల్‌ను ఆ ఛానల్ యాజమాన్యానికి సమాచారం లేకుండా 2000 సంవత్సరం ఐటీ చట్టం కింద బ్లాక్ చేసినట్టు సర్వీస్ ప్రొవైడర్ ద్వారా తెలియజేయడం, ఏ కారణం చేతనో ఒక రోజు తర్వాత మళ్లీ దాన్ని పునరుద్ధరించడం చూసాం. సమాచారం తెలుసుకునేందుకు భారత రాజ్యాంగం ఈ దేశప్రజలకు ఇచ్చిన హక్కును కాపాడే బాధ్యతను మాత్రమే నిర్వర్తించాల్సిన మీడియా ఆ పని మాత్రం మరిచిపోయి ఆశ్వరభ శరభ అంటూ శివాలెత్తిపోతున్న వేళ వాటిమీద ఏ చర్యా లేకుండా వదిలేసి, సత్యాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ప్రసారం చేసే, ప్రచురించే ఇటువంటి మాధ్యమాలకు ఆటంకాలు సృష్టించడం పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించడమే అనడంలో సందేహం లేదు. భారతదేశం మీద పాకిస్తాన్ చేస్తున్నటువంటి దుశ్చర్యలు ఇవాళ కొత్తగా జరుగుతున్నవేమీ కాదు. దానికి దీటుగా సమాధానం చెప్పేందుకు భారతదేశం వైపు నుంచి కూడా చర్యలు జరగడం ఇవాళ కొత్త ఏమీ కాదు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో కనీసం మూడు సందర్భాలలో 'ఆపరేషన్ సిందూర్' వంటి భారీ జవాబులు భారతదేశం ఇచ్చింది. మన మీడియా, పొరుగుదేశ ప్రభుత్వం ఇప్పుడు జరుగుతున్న దానిని యుద్ధం అంటున్నాయి కానీ భారత ప్రభుత్వం దీన్ని యుద్ధం అని అనకపోవడం గమనార్హం. మొత్తానికి తాత్కాలికంగానయినా ఇది రాయడం పూర్తవుతున్న సమయాన ఇరు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకారం ప్రకటించాయి. అయితే భవిష్యత్తులో భారతదేశంలో జరిగే ఏ ఉగ్రదాడినయినా యుద్ధంగానే పరిగణిస్తామని భారత్ ప్రకటించింది. మన మీడియా ఇప్పుడేం చేస్తుంది? ఇవాళ్టి నుండి ఒక కొత్త యుద్ధాన్ని వెతుక్కోవాలేమో.

# పెదకాకాని లో రేషన్ బియ్యం డీలర్లే కొనుగోలు..






పెదకాకాని జనం రిపోర్టర్: పెదకాకాని మండలంలో అగతవరపాడు పంచాయతీ పరిధిలో రేషన్ డీలర్ , ఎండియు వాహనం దారుడు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తు చప్పుడు కాకుండా రేషన్ మాఫియా కు అందిస్తున్నారు. పేదల బియ్యం పెద్దల పాలు గద్దల తన్నుకు పోతున్నారు. కేజీ రూ.10 చొప్పున కొనుగోలు చేసే అక్రమదారులకు 30 రూపాయలు చొప్పున అమ్ముకుంటున్న వైనం బహిరంగంగా తయారయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపటానికి ఇస్తున్నటువంటి బియ్యాన్ని పేదల పొట్టలు కొట్టి డీలర్లు లక్షల సంపాదిస్తున్నారు. ఒక పక్కన కూటమిప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా రేషన్ దళారీ వ్యవస్థ పైన రేషన్ అక్రమంగా తరలించిన వారి పైన రేషన్ అమ్ముకుంటున్న వారి పైన క్రిమినల్ చర్యలు, రౌడీషీట్లు తెరుస్తామని చెప్పినటువంటి ముఖ్యమంత్రి మాటలను పట్టించుకోకుండా దళారులు ఇష్టానుసారంగా చల రేగిపోతున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన ఆయన మాటలను లెక్కచేయకుండా పేదల కడుపు కొడుతున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడిన వారం రోజుల్లోనే పెదకాకాని మండలంలో అగతవరపాడు గ్రామంలో రేషన్ షాప్ నెంబర్ 22 వ షాపు డీలర్ నారాయణమూర్తి , ఎం డి ఓ వాహనదారుడు ఎస్. కే .దాదావాలి ఇద్దరు కలిసి పేదలకు అందించాల్సిన బియ్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా వాహనదారులే డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నటువంటి వైనం నెలలు తరబడి జరుగుతుంది. పెదకాకాని మండలం ఉన్నటువంటి అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి బియ్యాన్ని తరలిస్తున్నారు. డీలర్లు అధికారులకు నెల మామూళ్లు ఇస్తూ యదేచ్ఛగా రేషన్ మాఫియాను నడుపుతున్నారు. పెదకాకాని మండలంలోని అగతరవరపాడు లో జరుగుతున్న రేషన్ మాఫియాను జిల్లా ఉన్నతాధికారులు కట్టడి చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.







## అదృశ్యం చేస్తున్న మహా కృష్ణబిలం గెలాక్సీ కేంద్రస్థానంలో కాకుండా దూరంగా ఉన్న సంచార బ్లాక్‌హోల్ అంతరిక్ష వింత గుట్టు విప్పిన హబుల్ టెలిస్కోప్

# నక్షత్రాన్నే నమిలేస్తూ.. మింగేస్తూ



నక్షత్రం అంటేనే అంతులేని ఉష్ణంతో, దేదీప్యమానంగా వెలిగిపోతూ వందల కోట్ల కిలోమీటర్ల దాకా కాంతిని వెదజల్లే శక్తియంత్రం. అలాంటి నక్షత్రాన్ని అరటిపండులా అమాంతం మింగేస్తున్న రాకాసి కృష్ణబిలం జాడను అత్యంత అధునాతన హబుల్ టెలిస్కోప్ కనిపెట్టింది. నక్షత్రం మొత్తాన్ని తనలో కలిపేసుకుంటున్న ఈ బ్లాక్‌హోల్ మిగతా కృష్ణబిలాల్లా నక్షత్రమండలం(గెలాక్సీ) కేంద్రస్థానంలో కాకుండా కోట్ల కోట్ల కిలోమీటర్ల దూరంగా ఉండటం మరో విశేషం. గెలాక్సీ మధ్యలో కాకుండా చాలా దూరంగా సైతం భారీ కృష్ణబిలాలు మనగల్గుతాయని, వాటి అపారమైన గురుత్వాకర్షణ బలాలు సమీప స్టార్‌లనూ సమాధి చేస్తాయని తొలిసారిగా వెల్లడైంది. సాధారణంగా నక్షత్రాలను కృష్ణబిలం తనలో కలిపేసుకునే (టైడల్ డిస్ట్రప్షన్ ఈవెంట్-టీడీఈ) దృగ్విషయం గెలాక్సీ మధ్యలో చోటుచేసుకుంటుంది. కానీ ఇలా టీడీఈ అనేది గెలాక్సీ మధ్యలో కాకుండా వేరే చోట సంభవించడాన్ని తొలిసారిగా గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనికి 'ఏటీ2024టీవీడీ'అని పేరు పెట్టారు. మింగేస్తున్న ఈ కృష్ణబిలం ద్రవ్యరాశి ఆ అంతర్ధానమవుతోన్న నక్షత్రం ద్రవ్యరాశికంటే ఏకంగా 10 కోట్ల రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. నక్షత్రమండలం కేంద్రస్థానం చుట్టూ తిరిగే ఏదైనా నక్షత్రం అనుకోకుండా కృష్ణబిలం చెంతకు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ బ్లాక్‌హోల్ ఉందనే విషయం తెలుస్తుంది. బ్లాక్ తాను మింగేసే ఖగోళ వస్తువును ఉన్నది ఉన్నట్లుగాకాకుండా ఆకారాన్ని నూడుల్స్‌లాగా సాగదీసి సాగదీసి లోపలికి లాగేసు కుంటుంది. ఈ ప్రక్రియనే స్పాగెటిఫికేషన్ అంటారు. తాజాగా నక్షత్రాన్ని మింగేస్తున్న క్రమంలోనే ఈ కృష్ణబిలం ఉనికి వెలుగులోకి వచ్చింది. అమెరికా శాండిగోలోని పాలోమార్ అబ్జర్వేటరీలోని ఆప్టికల్ కెమెరా తొలిసారిగా దీనిని గుర్తించింది. ఈ బ్లాక్‌హోల్ మన భూమికి ఏకంగా 60 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. హబుల్ టెలిస్కోప్ దీనిపై మరింత పరిశోధన చేసింది. సాధారణంగా కృష్ణబిలంలోకి నక్షత్రం లాగబడే క్రమంలో ఆ నక్షత్రం ఊహించనంత స్థాయిలో అతినీలలోహిత కాంతిని బయటకు వెదజల్లుతుంది. తర్వాత బ్లాక్‌హోల్ లోపలికి వెళ్లిపోయి ఆ స్టార్ అంతర్ధానమవుతుంది.

### కేంద్రం నుంచి ఎంతో దూరంలో బ్లాక్‌హోల్

ఈ బ్లాక్‌హోల్ తనకు ఆశ్రయం ఇచ్చిన నక్షత్రమండలానికి సంబంధించిన కేంద్రస్థానంలో ఉండకుండా ఏకంగా 2,600 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీంతో కేంద్రస్థానంలోని బ్లాక్‌హోల్స్ కంటే ఇది భిన్నంగా ప్రవర్తిస్తుందేమో అని తెల్సుకునేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా రంగంలోకి దిగింది. ఈ కృష్ణబిలంపై ఓ కన్నేశామని చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ, నేషనల్ రేడియో ఆస్ట్రోనమీ అబ్జర్వేటరీలోని వెరీ లార్జ్ అరే రేడియో టెలిస్కోప్ పరిశోధకుల బృందాలు తెలిపాయి. రెండు గెలాక్సీల విలీనం తర్వాత ఇలాంటి కృష్ణబిలాలు ఇలా సుదూరంగా మిగిలిపోయి ఉంటాయని భావిస్తున్నారు. లేదంటే రెండు అయస్కాంతాల తరహాలో రెండు కృష్ణబిలాల వ్యతిరేక బలాల వల్ల ఇది సుదూరంగా నెట్టివేయబడి ఉండొచ్చని ఇంకొందరు అధ్యయనకారులు అంచనావేస్తున్నారు. "కేంద్రస్థానంలో స్థిరంగా ఉండిపోకుండా ఇలా సంచార జీవిలా ఎక్కడో మౌనంగా ఉన్న ఇలాంటి కృష్ణబిలాలు కొత్త తరహా పరిశోధనలకు సాయపడతాయి"అని బెర్క్లీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సంబంధిత పరిశోధనలో ప్రధాన రచయిత, ఖగోళశాస్త్రంలో పోస్ట్ డాక్టోరల్ యుహాన్ యూఓ చెప్పారు. త్వరలో అందుబాటులోకి రానున్న వెరీ సి.రూబిన్ అబ్జర్వేటరీ సాయంతో ఇలాంటి ఖగోళ వింతలను మరింత పరిశోధన జరగనుంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com